ప్రజాశక్తి

గురువారం 29 ఆగస్టు 2024 పేజీలు 8



విజయనగరం

పార్వతీపురం మన్యం



కొండను చదును చేస్తున్న పొక్లెయినర్

కొండను కొల్లగొడితే.. మండలానికే ముప్పు

కొండకాదది ఆ మండల వాసులకు కొండంత అండ. గొర్రెలు, బర్రెల మేత మొదలుకుని ఆకాశమార్గంలోని మేఘాలను సైతం కరిగించి వర్షం కురిపించే శక్తివంతమైన గిరిశిఖరం అది. ఇలా ఎన్నో రూపాల్లో ఇక్కడి జన జీవనానికి ఎంతో తోడ్పాటునందిస్తోంది. బహుశా అందుకేనేమో పురాతన కాలం నుంచి వందల ఎకరాల్లో విస్తరించి వున్న ఈ గిరిశిఖర ప్రాంతాన్ని చుట్టుపక్కల ప్రజలు బడిదేవరమ్మగా కొలుస్తున్నారు. కనిపించని దేవుడికన్నా... నిత్యం కనిపించే ఈ కొండనే మిన్నగా భావిస్తారు. ఇంతటి కొండలో నిక్షిప్తమైవున్న గ్రానైట్ గనులను కార్పొరేట్ శక్తుల లాభాల కోసం కొల్లగొట్టేందుకు ప్రభుత్వం ఏకపక్షంగా అనుమతులు ఇచ్చేసింది. దీంతో, ఉలిక్కిపడ్డ ప్రజానీకం ఎపి రైతు సంఘం, గిరిజన సంఘం ఆధ్వర్యాన అక్రమ మైనింగ్ అనుమతులను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. గడిచిన రెండు రోజులుగా మండల వ్యాప్తంగా బైక్ యాత్ర చేపట్టి సంఘటితమౌతున్నారు. ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకుంటామని శపథం చేస్తున్నారు.

- బడిదేవర కొండలో గ్రానైట్ తవ్వకాలకు ఏకపక్షంగా అనుమతులు
- అటవీ శాఖ అభ్యంతరాలు బేఖాతరు
- ప్రజాభిప్రాయ సేకరణకూ ససేమిరా
- జీవనం కోల్పోనున్న పార్వతీపురం మండల వాసులు

ప్రజాశక్తి-విజయనగరంప్రతినిధి/పార్వతీపురంరూరల్

పార్వతీపురం మండలంలో గంగాపురం, కోరి, బందలుప్పి, వీరభద్రపురం తదితర గ్రామాలకు ఆనుకుని బడిదేవర కొండ ఉంది. ఇది పేరుకు కొండైనా పార్వతీపురం మండలం వాసుల జీవనాడి. కొంతప్రాంతం చిట్టడవిని తలపిస్తుంది. మరోవైపు జీడి, మామిడి వంటి చెట్లు విస్తారంగా ఉంటాయి. ఏపుగా పెరిగిన చెట్లు, ఆకులు, అలములతో నిత్యం పచ్చదనం తొణికిసలాడుతూ ఉంటుంది. ఈనేపథ్యంలో వందల ఎకరాల్లో ఉన్న ఈ కొండపై తరచూ వర్షాలు పడుతుంటాయి. అక్కడి నుంచి నలువైపులా జారిన నీటితో చెరువులు నిండుతాయి. వర్షాకాలంలో అయితే, వాగులు నిత్యం పారుతుంటాయి. ఈ నీటితోనే ఈ మండలంలోని వరి తదితర వ్యవసాయ పంటలు పండుతాయి. తద్వారా వచ్చిన ఆదాయమే రైతులకు ఏడాది పొడవునా జీవనాధారం. గొర్రెలు, మేకలు, బర్రెలు వంటి పశువుల మేతకు కూడా ఇదే జీవనాధారం. గిరిజనులు పోడు వ్యవసాయం చేస్తున్నారు. ప్రభుత్వం పట్టాలు కూడా ఇచ్చింది. ఇలా ఎన్నో విధాలుగా జీవనాధారంగల ఈ కొండలో గ్రానైట్ నిక్షేపాలు ఉన్నాయి. వీటిని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు పాలకులు కొన్నేళ్లుగా తహతహ లాడుతున్నారు. ఇందులో భాగంగానే 2016లో అప్పటి (మిగతా..3లో)

అమరవీరులకు నివాళులర్పిస్తున్న వామపక్ష నాయకులు

విద్యుత్తు ఉద్యమ స్ఫూర్తితో

స్మార్ట్‌మీటర్ల రద్దుకు పోరాటం

విద్యుత్తు ఉద్యమ అమరవీరుల సంస్మరణ సభలో వామపక్ష నేతలు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్/విజయనగరంటౌన్

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై భారాలు వేసే స్మార్ట్ మీటర్ల ప్రక్రియను ఆపకపోతే మరో విద్యుత్తు పోరాటం తప్పదని వామపక్ష నాయకులు హెచ్చరించారు. విద్యుత్తు ఉద్యమ అమరవీరుల సంస్మరణ సభను పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమర వీరులు విష్ణువర్ధన్‌రెడ్డి, రామకృష్ణ, బాలస్వామి చిత్రపటాలకు వామపక్ష నాయకులు ఘన నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు బి.నర్సింగరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవరత్నం, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ నాయకులు పి.సంగం మాట్లాడారు. 2000 సంవత్సరం ఆగస్టు 28న ఆనాటి పాలకులు ప్రపంచ బ్యాంకు షరతులో భాగంగా విద్యుత్ ఛార్జీల పెంపునకు పూనుకున్నారని గుర్తుచేశారు. దీనిపై వామపక్షాలు పెద్దఎత్తున ఉద్యమం నిర్వహించాయని తెలిపారు. ఆ ఉద్యమంలో భాగంగా చలో హైదరాబాద్‌కు పిలుపు ఇచ్చిన సందర్భంలో బషీర్‌బాగ్ కాల్పుల ఘటనలో రామకృష్ణ, విష్ణువర్ధన్, బాలస్వామిపై నాటి చంద్రబాబు ప్రభుత్వం కర్కశంగా కాల్పులు చేసిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆ ఘటనలో ముగ్గురు అమరులయ్యారని తెలిపారు. అప్పటి నుంచి విద్యుత్ ఛార్జీలు పెంచాలంటే పాలక ప్రభుత్వాలు భయ పడేవని చెప్పారు. గత వైసిపి ప్రభుత్వం ట్రూ అప్ చార్జీలు, ఇతర పేర్లతో విద్యుత్ భారాలు వేసిందని తెలిపారు. ఈ భారాలను వ్యతిరేకించిన టిడిపి కూటమి ప్రభుత్వం ఇప్పుడు మరలా రాష్ట్రంలో వ్యవసాయ పంపుసెట్లకు, నివాసాలకు విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయవాడతో సహా పలు ప్రాంతాల్లో అదానీ సంస్థకు చెందిన మీటర్లను తెచ్చి విద్యుత్ కార్యాలయాల్లో భద్రపరుస్తున్నారని తెలిపారు. వ్యవసాయ పంపు సెట్లకు, ప్రభుత్వ కార్యాలయాల్లోనూ మీటర్లు బిగిస్తున్నారని చెప్పారు. తదుపరి నివాసాలకు స్మార్ట్‌మీటర్లు బిగించే ప్రక్రియకు సిద్ధమవుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. టిడిపి కూటమి ప్రభుత్వం మాట తప్పి కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు లొంగిపోయిందని, గతంలో వ్యతిరేకించిన మీటర్లనే కొనసాగించడం వాగ్దాన భంగమే అవుతుందని స్పష్టంచేశారు. బడా కార్పొరేట్ కంపెనీలకు ప్రయోజనాలు కల్పించే ఉద్దేశంతోనే కేంద్రం ఈ స్మార్ట్ మీటర్లను రుద్దుతోందని విమర్శించారు. స్మార్ట్ మీటర్లను నిలిపివేయాలని, అదాని, షిర్డీ సాయి తదితర కంపెనీలతో చేసుకున్న ఒప్పందాలను (మిగతా..3లో)

30న జిల్లా వ్యాప్తంగా వనమహోత్సవం

మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

ఒకే రోజు లక్ష మొక్కలు నాటడమే లక్ష్యం : విజయనగరం కలెక్టర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఈనెల 30న వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఒకే రోజున జిల్లా వ్యాప్తంగా లక్ష మొక్కలు నాటేందుకు కార్యాచరణ ప్రణాళికలు రూపొందించామన్నారు. తదుపరి దశల్లో అటవీశాఖ వద్దనున్న మరో ఏడు లక్షల మొక్కలు నాటేందుకు కూడా ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న ఈ కార్యక్రమంలో అన్ని ప్రభుత్వ శాఖలూ, ప్రజలు భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు. వనమహోత్సవ ఏర్పాట్లపై కలెక్టర్ బుధవారం తన కార్యాలయంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్షించారు. డెంకాడ మండలం బేతనాపల్లి వద్ద జిల్లా స్థాయి వనమహోత్సవం కార్యక్రమాన్ని అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. జిల్లాలోని అన్ని పాఠశాలలు, కళాశాలల ఆవరణల్లో మొక్కలు నాటించేందుకు ప్రణాళికలు రూపొందించాలని డిఇఒ, ఇంటర్ బోర్డు అధికారులను ఆదేశించారు. జిల్లాలోని గిరిజన (మిగతా.. 3లో)

డిజిపి ద్వారకా తిరుమలరావును విశాఖపట్నంలో విజయనగరం, మన్యం ఎస్‌పిలు వకుల్ జిందాల్, మాధవరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు.



మాట్లాడుతున్న న్యాయస్థానం చైర్మన్ సత్యనారాయణ

సమస్యల పరిష్కారానికే న్యాయస్థానం

ప్రజాశక్తి- బొబ్బిలి

విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకే విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం ఉందని న్యాయస్థానం చైర్మన్ బి.సత్యనారాయణ అన్నారు. స్థానిక విద్యుత్ రూరల్ సబ్ డివిజన్ కార్యాలయంలో బుధవారం విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సమస్యలను నిర్ణీత సమయంలోగా పరిష్కరించకపోతే న్యాయ స్థానాన్ని ఆశ్రయించ వచ్చునని చెప్పారు. విద్యుత్ సమస్యలపై లిఖిత పూర్వకంగా, మెయిల్ ద్వారా లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1912 ద్వారా ఫిర్యాదు చేస్తే నిర్ణీత కాలం లోగా పరిష్కరించకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయించి న్యాయం పొందవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో సాంకేతిక సభ్యులు వి.జనార్ధనరావు, రూరల్ ఎడిఇ ఎం.భానునాయుడు, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు ఫిజియోథెరపీ

ప్రజాశక్తి- రేగిడి

మండల కేంద్రంలోని ఎంఆర్‌సి కార్యాలయంలో బుధవారం ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ఆర్థోపెటిక్ వైద్యులు రామచంద్రిక ఫిజియోథెరపీ నిర్వహించారు. ఈ ఫిజియోథెరపీని ఎంఇఒలు వరప్రసాదరావు, ఎరకయ్య పరిశీలించారు. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వీరితోపాటు ఐఇఆర్‌పియు మహేశ్వరి, రాజేష్, కేర్ టేకర్ అనూరాధ, సిఆర్‌పిలు ఉన్నారు.

పోలీస్ బీట్‌ను ప్రారంభించిన సిఐ

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణంలో దేవిబొమ్మ జంక్షన్‌లో సిఐ వి.నారాయ ణమూర్తి బుధవారం పోలీస్ బీట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో పెరుగుతున్న ట్రాఫిక్ నియంత్రించేందుకు గతంలో ఉండే పోలీస్ బీట్‌ను మళ్లీ ఇప్పుడు ప్రారంభిస్తున్నామని దీనివల్ల ప్రజలకు అసౌకర్యాల నుంచి విముక్తి కలుగుతుందని ఆయన అన్నారు.

ఒకేచోట కలసిన రిటైర్డ్ ఉపాధ్యాయులు

విశ్రాంత ఉపాధ్యాయుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జరజాపు పేటలో రిటైర్డ్ ఉపాధ్యాయుల ఆత్మీయ కలయిక బుధవారం విశ్రాంత ఉపాధ్యాయులు కడలి ప్రకాశ రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. 1967-69లో ఉపాధ్యాయ శిక్షణ పొంది 1970-80 దశకంలో ఉపాధ్యాయులుగా సేవలందించి రిటైర్డ్ అనంతర ఆత్మీయంగాఒకే వేదిక పై కలుసుకున్నారు. వారంతా తమ తీపి గుర్తులు నెమరు వేసుకున్నారు. అనంతర విశ్రాంత ఉపాధ్యాయులు కడలి ప్రకాశ రావు తన తల్లిదండ్రులు, స్వర్గీయ రామబ్రహ్మం, సత్యవతి, భార్య అనసూయ విగ్రహాల ఆవిష్కరణలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గరివిడి మండలం తొండ్రంగి జెడ్‌పి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కడలి రమేష్ కుమార్, కుటుంబ సభ్యులు కడలి సత్యసాయి గణేష్, కడలి వేంకటేశ్వరరావు, వాణి, రమ తదితరుల పాల్గొన్నారు.

1న మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి- బొబ్బిలి

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 1న మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు జనసేన కార్యనిర్వాహక రాష్ట్ర కార్యదర్శి బాబు పాలూరి చెప్పారు. రక్తదాన శిబిరాన్ని జయప్రదం చేయాలని కోరారు. 2న పర్యావరణ పరిరక్షణకు 2వేలు మొక్కలు పంపిణీ చేస్తామన్నారు. పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను జయప్రదం చేయాలని జనసైనికులు, మెగా అభిమానులను కోరారు.

బకాయి వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి - రామభద్రపురం

ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని సిఐటియు నాయకులు బలస శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మండల విద్యా వనరుల కేంద్రం వద్ద వేతనాలు చెల్లించాలని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 ఏప్రిల్ నుంచి నేటి వరకు జీతాలు చెల్లించలేదని కేవలం నెలకు ఇస్తున్న ఆరువేల రూపాయల కూడా సకాలంలో చెల్లించకపోతే కుటుంబ పోషణ ఎలా చేయాలని ఆవేదన వ్యక్తం చేశారు. తమను పార్ట్ టైం వర్కర్స్‌గా గుర్తించిన ప్పటికీ ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 7 గంటల వరకు పాఠశాలలోనే ఉంచడం సరికాదన్నారు. మరుగు దొడ్ల క్లీనింగ్‌తో పాటు తరగతి గదులు కూడా శుభ్రం చేయిస్తూ రికార్డులు అందించమనడం, జెరాక్స్ పత్రాలు తీయించడం, పిల్లల్ని కంట్రోల్ చేయడం వంటి పనులు

రామభద్రపురం : నిరసన తెలుపుతున్న కార్మికులు

చేయించుకుంటున్నా యూనిఫామ్, గుర్తింపు కార్డులు, ఇఎఫ్ఐ, పిఎఫ్, సిక్ లీవులు మెటర్నటీ లీవులు వంటి సౌకర్యాలు అమలు చేయడం లేదన్నారు. తమ సమస్యలు పరిష్కరించి బకాయి వేతనాలు చెల్లించి, ప్రస్తుతం ఇస్తున్న వేతనాన్ని రెట్టింపు చేయాలని, పని గంటలు అమలు చేయాలని, పూర్తి స్థాయి వర్కర్లుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. తమ యూనియన్ పిలుపుమేరకు సెప్టెంబర్ 2న కలెక్టరేట్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా చేయనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ కారంగి లక్ష్మి, రాజేశ్వరి, రామలక్ష్మి, పద్మ, మంగ పాల్గొన్నారు.

ఆసుపత్రి సిబ్బంది గోడు పట్టదా?

నెల్లిమర్ల: ప్రభుత్వానికి ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేస్తున్న సిబ్బంది గోడు పట్టదా అని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ ప్రశ్నించారు. బుధవారం స్థానిక సిహెచ్‌ఎన్‌సి వద్ద జీతాలు కోసం నిరసన ధర్నా చేశారు. బుగత అశోక్ మాట్లాడుతూ గత 5 నెలలుగా వేతన బకాయిల అందక ఆసుపత్రి సెక్యూరిటీ గార్డులు, పారిశుధ్య సిబ్బంది ఇబ్బంది పడి నిరశన ధర్నా చేస్తుంటే వారి గోడు ప్రభుత్వానికి, అధికార్లకు పట్టదా అని ప్రశ్నించారు. జీతాలు చెల్లించకపోతే సెప్టెంబర్ 5 వ తేదీ తర్వాత కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుని నిరవధిక దీక్షలు చేపడతామని హెచ్చరించారు.

విఆర్‌ఎలకు నైట్ డ్యూటీలు అన్యాయం

ప్రజాశక్తి- బొబ్బిలి

విఆర్‌ఎలకు నైట్ డ్యూటీలు వేయడం అన్యాయమని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు అన్నారు. విఆర్‌ఎలకు నైట్ డ్యూటీలు వేయవద్దని బుధవారం కోటలో ఎమ్మెల్యే బేబినాయనకు వినతిపత్రం అందజేశారు. విఆర్‌ఎలకు నైట్ డ్యూటీలు వేస్తూ సిసిఎల్‌ఎ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేయడం సరికాదన్నారు. చాలీచాలని వేతనాలతో విఆర్‌ఎలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం వలే ఏపి ప్రభుత్వం కూడా పే స్కేల్ అమలు చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న అటెండర్, వాచ్‌మెన్, రికార్డు అసిస్టెంట్, విఆర్‌ఒ పోస్టులను భర్తీ చేయాలని, అర్హత ఉన్న విఆర్‌ఎలకు విఆర్‌ఒ పోస్టులు ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. విఆర్‌ఎలు ఎదుర్కొంటున్న

ఎమ్మెల్యేకు వినతినిస్తున్న సిఐటియు నాయకులు

సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని బేబినాయనను కోరగా సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో విఆర్‌ఎల సంఘం నాయకులు లక్ష్మణరావు, అప్పారావు, రాజారావు, ముని, విఆర్‌ఎలు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనమిస్తే జైలుకే

ప్రజాశక్తి- బాడంగి

ఎస్ఐ తారకేశ్వరరావు

మైనర్లకు వాహనమిస్తే జైలుకే పంపిస్తామని ఎస్ఐ తారకేశ్వర రావు అన్నారు. మందు తాగి వాహనం నడిపినా శిక్ష పడుతుందన్నారు. విజయనగరం నుంచి బదిలీ పై వచ్చిన ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఎస్ఐ జయంతి మానపురం బదిలీ అయ్యారు. వాహనం నడిపేటప్పుడు లైసెన్స్ సరైన వాహనం పత్రాలు చూపించకపోయినా చర్యలు తప్పవన్నారు. రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలి

ప్రజాశక్తి - రామభద్రపురం

మండల కేంద్రంలో ట్రాఫిక్ నియంత్రణకు ఆటోవాలాలు సహకరించాలని బొబ్బిలి రూరల్ సిఐ నారాయణరావు కోరారు. స్థానిక మూడు రోడ్ల జంక్షన్ వద్ద బుదవారం ఆటో డ్రైవర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ ఆర్‌టిసి కాంప్లెక్స్, అంతర్జాతీయ కూరగాయల మార్కెట్ ఒకే దగ్గర ఉండడం వల్ల ట్రాఫిక్ నియంత్రణ ఇబ్బందిగా ఉందని, ఆటోలు నిర్దేశిత పార్కింగ్ ప్రదేశంలోనే ఉంచి సహకరించాలని కోరారు. ఆటోల్లో పరిమితి మేరకే ప్రయాణీకులు, సరకులు రవాణా చేస్తూ, నియమిత వేగంతో రహదారి భద్రతా నియమాలు పాటిస్తూ వాహనాలు నడపాలన్నారు. వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువ పత్రాలు, బీమా, ఫిట్నెస్, లైసెన్స్ వంటి వాటిని వెంట ఉంచు కోవాలన్నారు. అనుమానిత, మాదక ద్రవ్యాలు రవాణా చేసే వారు ప్రయాణీకుల మాదిరిగా ఆటోల్లో ఉంటే వారి వివరాలు వెంటనే తెలియజేయాలన్నారు. ప్రయాణికుల భద్రతకు పెద్ద పీట వేస్తూ ఇల్లీగల్ యాక్టివిటీస్ అడ్డుకునేందుకు పోలీసుశాఖకు సహకరిం చాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు, వివిధ గ్రామాల ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

అభివృద్ధిపైనే ప్రభుత్వం దృష్టి

ప్రజాశక్తి - సంతకవిటి

అభివృద్ధిపైనే తమ ప్రభుత్వం దృష్టి పెట్టిందని ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్‌రావు అన్నారు. మండలంలోని మండా కురిటి గ్రామంలో బుధవారం గ్రంథాలయం, సచివాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ప్రైమరీ హెల్త్ సెంటర్ అదనపు భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన రెండు నెలల్లోనే అభివృద్ధి వైపు పరుగులు పెడుతున్నామన్నారు. గ్రామంలో అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ప్రభుత్వ నిర్ణయంపై హర్షం

ప్రజాశక్తి-చీపురుపల్లి

టిడిపి మేనిఫెస్టోలో చెప్పిన విధంగా దేవాలయాల, బ్రాహ్మణుల, అర్చకుల సమస్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు కాబినెట్‌లో తీసుకున్న నిర్ణయాలకు రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, బ్రాహ్మణ క్రెడిట్ సొసైటీ మాజీ డైరెక్టర్ భోగాపురపు వాయునందన శర్మ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. దేవాలయాల పవిత్రతను, దేవాలయాల ఆస్తులను కాపాడతామని, గుడుల్లో ఆధ్యాత్మిక వాతావరణం పెంపొందిస్తామని, బ్రాహ్మణుల, అర్చకుల సమస్యలు పరిష్కరిస్తామని ఎన్నికలకు ముందు మేనిఫెస్టోలో చంద్రబాబు హామీ ఇచ్చారని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన మూడు మాసాల్లోనే టిటిడి నుంచే ప్రక్షాళన ప్రారంభించారని తెలిపారు. సీఎం చంద్రబాబు ఇటీవల దేవాదాయ శాఖపై జరిగిన సమీక్షలో దేవదాయ శాఖ పరిధిలో ఉన్న చిన్న ఆలయాల్లో అర్చకులకు నెలకు రూ.10వేలు నుంచి రూ.15వేలకు పెంచడంతో పాటుగా, ఆయా ఆలయాల్లో ధూప దీప నైవేద్యాల నిమిత్తం రూ.5వేలు నుంచి రూ.10వేలు చేయడం గొప్పవిషయమన్నారు. వేద విద్య చదువుకున్న నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు అందించాలనే నిర్ణయం చాలా మంచి పరిణామం అని అన్నారు.

సొంత నిధులతో బస్ షెల్టర్ నిర్మాణం

ప్రజాశక్తి - రామభద్రపురం

మండల కేంద్రంలో చొక్కాపు వీధి జంక్షన్ వద్ద బుధవారం మాజీ జిల్లా బోర్డు మెంబర్ కీర్తిశేషులు చొక్కాపు అప్పలనాయుడు జ్ఞాపకార్థం వారి కుమారులు సొంత నిధులతో నిర్మించిన బస్సు షెల్టర్‌ను స్తానిక ఎమ్మెల్యే బేబీనాయన చేతుల మీదుగా ప్రారంభిం చారు. అనంతరం ఆ ప్రాంతంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలుష్యం ఎక్కువవ్వడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వర్షాభావ పరిస్థితులు కూడా నెలకొంటున్నాయని, ఇటువంటి తరుణంలో ప్రతి ఒక్కరూ పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని కోరారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని పరిరక్షిం చాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా మొక్కల పెంపకానికి ప్రాధా న్యత ఇస్తుందన్నారు. ఇక్కడ ప్రజలకు ఉపయో గపడే విధంగా బస్సు షెల్డర్‌ను సొంత నిధులతో నిర్మించిన చొక్కాపు కుటుంబాన్ని ఈ సందర్భంగా బేబీనాయన అభినందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు మడక తిరుపతిరావు, తహశీల్దార్ ఆకుల సులోచనారాణి, టిడిపి మండల అధ్యక్షులు కరణం విజయ భాస్కరరావు, చొక్కాపు రామారావు, జనసేన నాయకులు మహంతి ధనంజయరావు, పాల్గొన్నారు.

బస్ షెల్టర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

కొండను కొల్లగొడితే మండలానికే ముప్పు

(మొదటి పేజీ తరువాయి)

టిడిపి ప్రభుత్వం గ్రానైట్ తవ్వకాలకు అనుమతులు ఇచ్చేసింది. కొండను ధ్వంసం చేస్తే రైతులు, గిరిజనులు, వృత్తిదారులు, పశువుల పెంపకం దారులు జీవనం కోల్పోతారని అప్పట్లోనే సిపిఎం వ్యతిరేకించింది. మరోవైపు ఈ కొండ ప్రాంతమంతా రిజర్వు ఫారెస్టు పరిధిలో ఉందని, తమ అనుమతులకు బదులు రెవెన్యూ అనుమతులతో ఎలా తవ్వకాలు చేపడతారంటూ అటవీశాఖ అధికారులు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో 2017లో తవ్వకాల అనుమతులకు తాత్కాలికంగా బ్రేకు పడింది.

అడ్డగోలుగా లాభాలార్జించడం రుచి మరిగిన గ్రానైట్ కంపెనీ పాలకుల కనుసన్నల్లోనే ఎగువ న్యాయస్థానానికి వెళ్లింది. అటవీశాఖ అభ్యంతరాలకు లోబడి చర్యలు తీసుకోవాలంటూ ఎగువ కోర్టు ఆదేశించినప్పటికీ, ప్రభుత్వం (గనుల శాఖ) అధికారులు వాటన్నింటినీ పెడచెవిన పెట్టి మరీ తవ్వకాలకు ఈ ఏడాది గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. కనీసం ప్రజాభిప్రాయ సేకరణ కూడా చేపట్టలేదు. ఈ నేపథ్యంలో ఈ కొండపై ఆధారపడిన గిరిజనులు, రైతులు, వృత్తిదారులు, ఇతర ప్రజానీకం ఆందోళనలో ఉన్నారు. వీరిని ఐక్యం చేసి పోరాడేందుకు ఎపి రైతు సంఘం, గిరిజన సంఘం సమాయుక్తమయ్యాయి. ఇందులో భాగంగానే గడిచిన రెండు రోజులుగా గ్రానైట్ తవ్వకాలకు ఇచ్చిన అక్రమ అనుమతులు రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ బైక్ర్యాలీ చేపట్టారు. అనుమతులు రద్దుచేసే వరకు పోరాడతామని చెబుతున్నారు.

బడిదేవర కొండతో గిరిజనుల జీవనం ముడిపడి ఉంది

బడిదేవర కొండతో గిరిజనుల జీవితాలు మమేకమైపోయాయి. ఈ కొండను ఒక దేవతగా ఎనిమిది పంచాయతీల రైతులు, గిరిజనులు కొలుస్తారు. వర్షాలు కురవకపోతే బడిదేవరకొండ తల్లికి మొక్కుబడి చెల్లిస్తే వర్షం పడుతుందని ఇక్కడి ప్రజల నమ్మకం. అందుకని ఈ చుట్టుపక్కల ప్రజలు ప్రతి ఏటా పూజలుచేసి మొక్కులు చెల్లిస్తారు. కొండను ఆనుకొని అనేక గిరిజన గ్రామాలు ఉన్నాయి, వారికి ప్రభుత్వం కొండపోడు పట్టాలు ఇచ్చింది. ఈ భూమ్మీద జీడి మామిడి ఫలసాయాలు పండించుకుని ఆదాయ వనరుగా మార్చుకున్నారు. కొండపై కురిసిన వర్షపు నీరుతో ఈ ప్రాంతాల్లో కొద్దో,గొప్ప పంటలు పండుతున్నాయి. అటువంటి కొండను ప్రభుత్వాలు అమ్మకానికి పెట్టి గ్రానైట్ తొవ్వుకోవడమంటే ప్రజలకు ద్రోహం చేసినట్లే.

- కద్రక రామస్వామి, సర్పంచి, రావికోన

ఐక్యంగా ఉద్యమించి తవ్వకాలను అడ్డుకుంటాం

2017 లో బడిదేవర కొండ తవ్వకాలకు అనుమతులు ఇచ్చినప్పుడు ఈ ప్రాంత ప్రజలంతా కలిసికట్టుగా పోరాటం చేశారు. అప్పుడు ఈ కొండ రిజర్వ్ ఫారెస్ట్ అని తేలింది. జిల్లా, మండల, రాష్ట్ర సర్వే శాఖలు, ఫారెస్ట్ అధికారులు 17 సార్లు సర్వే చేశారు. వీటన్నింటిలోనూ ఆ కొండ రిజర్వు ఫారెస్ట్ అని తేలింది. మళ్లీ ఈఏడాది బడిదేవరకొండకు అనుమతులు ఇచ్చి ఈ కొండను తవ్వుకోవాలని చెప్పడం సిగ్గుచేటు. ఈ తవ్వకాల వలన భవిష్యత్తులో గిరిజనులకు ఎటువంటి ఇబ్బందులు వచ్చినా ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలి. ఈ ప్రాంత ప్రజలందరినీ ఏకం చేసి అనుమతులు రద్దు చేసేంతవరకు పోరాడుతాం.

- కె.శంకరరావు, గిరిజన సంఘం సభ్యులు, రంగాలగూడ

30న జిల్లా వ్యాప్తంగా వన మహోత్సవం

(మొదటి పేజీ తరువాయి)

విశ్వవిద్యాలయం, జెఎన్‌టియు పరిధిలో కూడా మొక్కలు నాటాలని సూచించారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో వివిధ పథకాల కింద మొక్కలు నాటే కార్యక్రమాలను ప్రారంభించాలన్నారు. వివిధ సంక్షేమ వసతిగహాలు, హౌసింగ్ కాలనీలు, దేవాలయాల ఆవరణలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పరిశ్రమలు, ఆసుపత్రులు, రైల్వే భూముల్లో మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. రోడ్ల పక్కన, కాల్వ గట్లపై మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టాలని జిల్లాపరిషత్ సిఇఒకు సూచించారు.

సెప్టెంబరు 1 నుంచి 15వ తేదీ వరకు జిల్లాలోని విద్యార్థులకు వివిధ అంశాలపై వ్యాసరచన, డ్రాయింగ్, చిత్రలేఖనం వంటి అంశాల్లో పోటీలు నిర్వహించాలని డిఇఒకు సూచించారు. మున్సిపాలిటీలు, మేజర్ పంచాయతీల్లో వనమహోత్సవం రోజున సైకిల్ ర్యాలీలు నిర్వహించాలన్నారు. అన్ని మండలాల్లోనూ ప్రత్యేక అధికారుల నేతృత్వంలో మొక్కలు నాటే కార్యక్రమాలను విస్తతంగా చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా అటవీ అధికారి ఎస్.వెంకటేష్, జెడ్‌పి సిఇఒ శ్రీధర్ రాజా, డిఇఒ ప్రేమ్ కుమార్, హౌసింగ్ పీడీ శ్రీనివాస్, డిఆర్‌డిఎ. ఎపిడి సావిత్రి, డ్వామా ఇన్‌ఛార్జి పీడీ అరుణశ్రీ, డిఎస్‌డబ్ల్యుఒ రామానందం, ఎల్‌డిఎం రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజూ కొనసాగిన దీక్షలు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

ఏకలవ్య పాఠశాలల్లో పనిచేస్తూ ఉద్యోగాలు కోల్పోయిన గిరిజన యువతులు పువ్వల లావణ్య, పండిక బంగారమ్మలకు తిరిగి ఉద్యోగాలు ఇవ్వాలని కోరుతూ ఐటిడిఎ ఎదుట చేపట్టిన నిరసన దీక్షలు రెండో రోజు బుధవారం కొనసాగాయి. గిరిజనేతర అభ్యర్థులు జి.రమేష్, డి.తేజేశ్వరికి ఇచ్చినట్లే గిరిజన యువతులకు ఉద్యోగాలు ఇవ్వాలని గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పాలక రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మైదాన ప్రాంత గిరిజన నిరుద్యోగ సంఘం నాయకులు రఘుపతుల శశిభూషణ్, నందివాడ పార్వతీశం, బాధిత యువతులు పువ్వల లావణ్య, పండిక బంగారమ్మ, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు ఉద్యమ స్ఫూర్తితో

స్మార్ట్ మీటర్ల రద్దుకు పోరాటం

(మొదటి పేజీ తరువాయి)

విజయనగరంలో అమరవీరుల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రభుత్వం రద్దు చేయాలని, బిగించిన మీటర్లను తొలగించాలని డిమాండ్‌చేశారు. లేకుంటే మరో విద్యుత్తు పోరాటం తప్పదని హెచ్చరించారు. అనంతరం సిపిఎం పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ, ప్రజా సంఘాల నాయకులు విజయలక్ష్మి, రెడ్డి శ్రీదేవి, వై.మన్మథ రావు తదితరులు మాట్లాడారు. సభలో వామపక్ష ప్రజాసంఘాల నాయకులు ఆర్.సర్వేశ్వర రావు, పి.అప్పలరాజు, జి.సర్వేశ్వరరావు, పి.జయలక్ష్మి, వి.ఇందిర, బంకురు సూరిబాబు, పాకల సన్యాసిరావు, పి.రాజశేఖర్, డేవిడ్, రాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : స్మార్ట్ మీటర్లను వెనక్కి తీసుకోకుంటే మరో విద్యుత్తు పోరాటం తప్పదని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి హెచ్చరించారు. చోళ్లపదం గ్రామంలో వద్ద సిపిఎం ఆధ్వర్యంలో విద్యుత్తు పోరాట అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బషీర్‌బాగ్ విద్యుత్తు పోరాటంతో 15 ఏళ్లపాటు ఏ ప్రభుత్వమూ విద్యుత్తు ఛార్జీలు పెంచే సాహసం చేయలేదని గుర్తుచేశారు. కేంద్రంలో మోడీ ఆదేశాల మేరకు స్మార్ట్ మీటర్ల ప్రక్రియను మళ్లీ మన రాష్ట్రంలో అమలు చేయడానికి టిడిపి కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. దీన్ని రైతులు, ప్రజలు వ్యతిరేకించాలని కోరారు.

విజయనగరం టౌన్ : విద్యుత్ అమర వీరుల స్ఫూర్తితో రాష్ట్రంలో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఉద్యమిస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు అన్నారు. బుధవారం స్థానిక ఎల్‌బిజి భవనంలో విద్యుత్ అమర వీరుల దినోత్సవం సందర్భంగా రామకృష్ణ, బాలరాజు, విష్ణువర్ధనరెడ్డి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శంకర్రావు మాట్లాడుతూ 2000వ సంవత్సరంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ బోర్డును ముక్కలు చేసి విద్యుత్ సంస్కరణల పేరుతో విద్యుత్‌ను ప్రైవేటు పరం చేసిన నాటి టిడిపి ప్రభుత్వమే నేడు మళ్లీ విద్యుత్ స్మార్ట్ మీటర్లు తీసుకొచ్చి ప్రజలపై విద్యుత్తు భారాలు వేసేందుకు సిద్ధమవు తున్నదని అన్నారు. అప్పుడు, ఇప్పుడు ప్రపంచ బ్యాంక్ విధానాలే అమలు చేస్తున్న ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలు చేపడతామని అన్నారు. నాడు బషీర్‌బాగ్ కాల్పుల్లో బాలస్వామి, రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి ప్రాణాలు కోల్పోయారని, వారి త్యాగాలు, వామపక్షాల ఉద్యమ ఫలితంగా నేటి వరకు ప్రభుత్వాలు విద్యుత్ ఛార్జీలు పెంచేందుకు వెనకడుగు వేశాయని అన్నారు. నేడు మళ్లీ చంద్రబాబు ప్రభుత్వం గృహ విద్యుత్తు వినియోగానికి స్మార్టు మీటర్లు పెట్టేందుకు సిద్ధమవుతోందని, ఈ విధానాలకు వ్యరేకంగా పోరాడుతామని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు శ్రీనివాస, ఎ.జగన్ మోహన్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, బి.రమణ, వి. రామచంద్రరావు, ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ నాయకులు వెంకటేష్, జగదీష్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల నిర్వహణలో అలసత్వం వద్దు

విజయనగరం : జిల్లాలో ఉపాధిహామీ పథకం నిధుల కింద మంజూరు చేసిన పనులు చేపట్టడంలో అలసత్వం వహించే అధికారులపై తప్పక చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చెప్పారు. జిల్లాలో ప్రస్తుత ఏడాదికి సంబంధించి మొక్కలు నాటడం, డ్రెయిన్లు, సిసి రోడ్లు, ఫారం పాండ్ ల నిర్మాణం వంటి పనులు మంజూరు చేసినప్పటికీ ఆ పనుల్లో కనీస స్థాయిలో కూడా ప్రగతి చూపని అధికారులపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తంచేశారు. ఉపాధి పనులపై కలెక్టర్ బుధవారం మండల స్థాయిలోని ఎంపిడిఒలు, ఉపాధిహామీ ఎపిఒలు, పంచాయతీరాజ్ ఇఇలు, గ్రామీణ నీటిసరపరా విభాగం ఏఇలతో ఆన్ లైన్ కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. సిసిరోడ్లు, డ్రెయిన్లు, బిటి రోడ్లు, డబ్ల్యు. బి.ఎం.రోడ్లు, ఫారంపాండ్లు వంటి పనుల లక్ష్యాలను రెండు వారాల్లోగా పూర్తిచేయాలని స్పష్టంచేశారు. ఉపాధి పనుల పురోగతిపై తనకు రోజువారీ నివేదికలు సమర్పించాలని, ప్రగతి చూపని అధికారులపై చర్యలు చేపడతామని స్పష్టంచేశారు. జిల్లాలో వచ్చే నెల 1వ తేదీన ఎన్టీఆర్ ఫించను భరోసా కింద ఫించను మొత్తాల పంపిణీకి ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని కలెక్టర్ ఆదేశించారు. ఫించన్ల పంపిణీ జరగాల్సి వున్న నేపథ్యంలో బదలీ ఉత్తర్వులు వచ్చిన ఉద్యోగులను సెప్టెంబరు 2వ తేదీ తర్వాతే రిలీవ్ చేయాలని సూచించారు. సమావేశంలో జెడ్‌పి సిఇఒ శీధర్ రాజా, డ్వామా పిడి అరుణ శ్రీ, గ్రామీణ నీటిసరఫరా ఎస్‌ఇ ఉమా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆశా కార్యకర్త మిందమ్మను పరామర్శిస్తున్న సిఐటియు నాయకులు

రెండు ఆటోలు ఢీ

ముగ్గురు ఆశావర్కర్లకు గాయాలు

ప్రజాశక్తి - కురుపాం/ కొమరాడ

రెండు ఆటోలు ఢీకొని ముగ్గురు ఆశా వర్కర్లకు తీవ్ర గాయాలైన సంఘటన కొమరాడ మండలంలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... మాదలింగి పిహెచ్‌సికి ఆశా వర్కర్లు ఆటోలో సమావేశానికి వెళ్తుండగా కెమిశీల - తులసివలస గ్రామ సమీపంలో రెండు ఆటోలు ఢీకొన్నాయి. గుణద తీలేసు పంచాయతీ బిన్నిడి, ఏగూరు, తీలేసు గ్రామాలకు చెందిన ఎం.మిందమ్మ, ఎం.లక్ష్మి, పి.కిడికమ్మ, యు.చంద్రయ్య గాయపడ్డారు. వీరిలో ఎం.మిందమ్మకు తీవ్రగాయాలయ్యాయి. ఆమెకు ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. మిగిలిన క్షతగాత్రులు కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్నారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు.జిల్లా కేంద్రాస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆశా కార్యకర్త మిందమ్మను సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి పరామర్శించారు.

హత్య కేసులో ఆరుగురికి జీవితఖైదు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్, గరుగుబిల్లి

గరుగుబిల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఐటిడిఎ పార్కు సమీపంలో 2018లో జరిగిన హత్య కేసులో ఆరుగురు నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష, ఒక్కొక్కరికి రూ. 1100 జరిమానా విధిస్తూ జిల్లా న్యాయస్థానం తీర్పునిచ్చింది. ఈ మేరకు ఎస్‌పి ఎస్.వి.మాధవ్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌పి కథనం ప్రకారం... వీరఘట్టం మండలం, చిట్టిపూడివలస గ్రామానికి చెందిన యామక గౌరీశంకర్ అనే వ్యక్తిని ఆయన భార్య యామక సరస్వతి కొంతమంది వ్యక్తులతో కలిసి ఐటిడిఏ పార్క్ వద్ద పథకం ప్రకారం హత్య చేయించింది. గౌరీశంకర్ తండ్రి యామక అప్పలనాయుడు ఫిర్యాదు మేరకు గరుగుబిల్లి పోలీస్ స్టేషన్‌లో అప్పటి ఎస్ఐ హరికృష్ణ కేసు నమోదు చేశారు. ఈ కేసును అప్పటి పార్వతీపురం సిఐ రాంబాబు దర్యాప్తు చేసి, నిందితులని అరెస్టు చేసి, కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో ఆరుగురు నిందితులకు యావజ్జీవ కఠిన కారాగార శిక్ష విధిస్తూ రెండో అదనపు జిల్లా జడ్జి దామోదర్ బుధవారం తీర్పు వెల్లడించారు.

రైల్వే స్టేషన్‌లో మొబైల్స్ దొంగ అరెస్టు

ప్రజాశక్తి-విజయనగరం కోట

రైల్వే స్టేషన్లలో మొబైల్స్ చోరీ చేస్తున్న నిందితుడిని పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. మంగళవారం సాయంత్రం విజయనగరం గవర్నమెంట్ రైల్వే పోలీస్ ఎస్ఐ వి. బాలాజీరావు తమ సిబ్బంది తో కలసి విజయనగరం రైల్వే స్టేషన్‌వద్ద ముమ్మర తనికీలు చేస్తుండగా అనుమానాస్పదంగా తిరుగుతున్న ఎస్.కోట మండలం, అలుగుబిల్లి గ్రామానికి చెందిన షేక్ రసూల్(32)ను అదుపులోకి తీసుకున్నారు. అత్ని అతడిని విచారణ చేయగా రైలులో దొంగిలించిన ఒక మొబైల్ ఫోన్ ను అతడి వద్ద నుండి రికవరీ చేశారు. విజయనగరం రైల్వేస్టేషన్‌లో ఆగి ఉన్న , ప్రయాణిస్తున్న రైళ్లలో దొంగతనాలకు పాల్పడినట్లు తెలిపారు. నిందితుడిని రైల్వేకోర్టులో హాజరు పర్చగా రిమాండ్ విధించారని ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

కురుపాం : శివ్వన్నపేట నుండి మాదలింగి వెళ్లే మార్గంలో కురుపాంకి చెందిన కొత్తకోట శివ గోవింద ద్విచక్ర వాహనంతో వెళుతుండగా బుధవారం గుర్తుతెలియని వాహనం వెనుక నుంచి ఢీకొంది. దీంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో కురుపాం సిహెచ్‌సికి ఆయన్ను తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

CHANGE OF NAME

I MOHAMMED SAYEED S/o UBEDULLA MOHAMMED, Door No: 53-1-75, CHINA HARIJANA PETA, Salur. I have changed My NAME as **MOHAMMAD SAYEED** (New NAME) Here After my name known as **MOHAMMAD SAYEED.**

రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడి శ్యాంసుందర్

యాజమాన్య పద్ధతులతో పొలం బడి

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

మేలైన యాజమాన్య పద్ధతుల ద్వారా రైతులు పొలం బడి కార్యక్రమాలను నిర్వహించుకోవాలని వ్యవసాయ శాఖ ఎడి యం.శ్యాంసుందర్ రైతులకు సూచించారు. బుధవారం కారాడ గ్రామంలో పొలం బడిలో ప్రధానంగా ఎరువులు యజమాన్యం కలుపు యజమాన్యం, నీటి యాజమాన్య విధానాలను రైతులకు వివరించారు. ఐదు శాతం వేప గింజల కషాయం తయారీ విధానాన్ని రైతులకు చేసి చూపించారు. తయారు చేసుకున్న వేప గింజల కషాయాన్ని వరి పంటపై ఏ విధంగా వాడాలి అనేది రైతులకు క్షుణ్ణంగా వివరించి పంట పొలాలపై పురుగు అదే విధంగా తెగుళ్ళ కనిపించినప్పుడు ముందుగా వేప గింజలు కషాయము లేదా వేప నూనెతో మాత్రమే పిచికారి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పొలంబడి రైతులు 30 మంది, గ్రామ వ్యవసాయ సహాయకులు మూడడ్ల సంతోషి, పెంటలత తదితరులు పాల్గొన్నారు.

సమిష్టి కృషితోనే అభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

సమిష్టి కృషితోనే అభివృద్ధి సాధ్యమని నాబార్డ్ డిడిఎం నాగార్జున తెలిపారు. ఎస్‌కోట రైతు భారత్ ఉత్పత్తిదారులు పరస్పర సహాయక సహకార సంఘం లిమిటెడ్ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని తిమిడి గ్రామంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఐఐఎమ్ఆర్, ఐసిఎఆర్ హైదరాబాద్ డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ సంగప్ప, డాక్టర్ రఫీ, సబలా సంస్థ సెక్రటరీ కే.సరస్వతి, ఎస్‌కోట రైతు భారతి సిఇఒ సత్యనారాయణ, బోర్డు సభ్యులు, రైతులు గ్రామ పెద్దలు వచ్చిన సన్యాసి నాయుడు తదితరులు పాల్గొని రైతు సంఘం ప్రయోజనాలు, విస్తరణ ఆవశ్యకత, రైతు భారత్ విజయాలు, భవిష్యత్తు ప్రణాళికలు గురించి వివరించారు.

చెరువు ఆక్రమణపై ఫిర్యాదు

భోగాపురం : మండల కేంద్రంలోని పల్లంట్ల వారి చెరువును కొంతమంది ఆక్రమించుకున్నారని భోగాపురం గ్రామానికి చెందిన ఆళ్ల వాసుబాబు బుధవారం తహశీల్దార్ సురేష్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి కోరారు. గొల్లపల్లి దాడితల్లి కాలనీ, ఎస్‌సి కాలనీలో బుధవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రోడ్లు, కాలువలు, ఖాళీ స్థలాల్లో చెత్త వేయకుండా పారిశుధ్య కార్మికులకు అందించాలని కోరారు. కాలనీలలో రోడ్లు లేకపోవడంతో వర్షా కాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆమె దృష్టికి తీసుకుని వెళ్లగా 15వ ఆర్థిక సంఘం నిధులతో రోడ్లు వేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఎస్‌టిఒగా ఆదినారాయణ

బొబ్బిలి : స్థానిక ఎస్‌టిఒగా ముదిలి ఆదినారాయణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఎస్‌టిఒ ఎల్.సత్యనారాయణకు పాదేరు బదిలీ కావడంతో ఆదినారాయణ పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. రిటైర్డ్ ఉద్యోగులు, ఉద్యోగులు వేతనాలు సకాలంలో అయ్యేలా చూస్తామని ఆదినారాయణ అన్నారు.

రెండుచోట్ల ఎస్‌ఎంసి ఎన్నికలు పూర్తి

బలిజిపేట : మండలంలో బుధవారం నారాయణపురం హైస్కూల్, గంగాడ ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఎస్‌ఎంసి ఎన్నికలు ప్రశాంతంగా పూర్తయ్యాయని ఎంఇఒ సింహాచలం తెలిపారు. పి.చాకరాపల్లి ప్రాథమిక పాఠశాలలో కోరం లేకపోవడంతో మరోసారి ఎన్నికలు వాయిదా వేశామన్నారు.

జనసేన కార్యాలయం ప్రారంభం

బలిజిపేట : బలిజిపేటలో బుధవారం జనసేన పార్టీ కార్యాలయాన్ని ఆ పార్టీ నాయకులు ప్రారంభించారు. ప్రజలకు అందుబాటులో ఉండేందుకు కార్యాలయాన్ని ఏర్పాటుచేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ఆలూరు వెంకట్ నాయుడు, మీసేవ కుమార్, పకీర్ నాయుడు పాల్గొన్నారు

'బొంతలకోటి'కి సత్కారం

ప్రజాశక్తి- మెంటాడ

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులు, ఐక్యరాజ్య సమితి అవార్డు గ్రహీత, గుర్ల తమ్మిరాజుపేట సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు డాక్టర్ బొంతలకోటి శంకరరావును మండలంలో గుర్ల తమ్మిరాజుపేట హైస్కూల్ ఆవరణలో బుధవారం పూర్వ ఎమ్మెల్సీ డాక్టర్ గాదె శ్రీనివాసులు నాయుడు ఘనంగా సత్కరించారు. ఇటీవల శంకరరావు మాస్టర్‌కి ఎపిజె అబ్దుల్‌కలాం జాతీయ అవార్డును విశాఖలో ప్రముఖులు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని సత్కరిస్తూ అతిపిన్న వయసులో 310 జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ అవార్డులు అందుకోవడం ఉపాధ్యాయ లోకానికి గర్వకారణమని శ్రీనివాసులనాయుడు కొనియాడారు. దేశంలోనే ప్రథమంగా కళారూపాలతో పాఠ్యాంశాలు భోదించి విద్యారంగానికి వినూత్నమైన సేవ చేస్తున్నారన్నారు. రచయితగా, గాయకుడిగా, సాహిత్యవేత్తగా బహుముఖ ప్రజ్ఞను పోసిస్తున్నారన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాస రామారావు మాట్లాడుతూ

శంకరరావును సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గాదె, తదితరులు

శంకరరావు మాస్టర్ కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో సహచర ఉపాధ్యాయులు, మెంటాడ మండల ఉపాధ్యాయ నాయకులు సిరిపురం కృష్ణ, అల్లాడ రామకృష్ణ, జి.అప్పల నాయుడు, పిఆర్‌టియు రాష్ట్ర నాయకులు రావాడ రాంబాబు తదితర ఉపాధ్యాయ నాయకులు పాల్గొన్నారు.

మద్యం సీసాలు ధ్వంసం

ప్రజాశక్తి- రాజాం, రేగిడి

నియోజవర్గం పరిధిలోని రేగిడి, వంగర, సంతకవిటి మండలాల్లో పోలీసులకు పట్టుబడిన మద్యం సీసాలను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల సమక్షంలో బుధవారం ధ్వంసం చేశారు. అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ బివిజి రాజు సమక్షంలో మూడు పోలీస్ స్టేషన్ పరిధిలో గల 50 బీరు సీసాలు, 30 లీటర్ల నాటు సారా, 5లక్షలు విలువ చేసే మద్యం బాటిల్లను ధ్వంసం చేశారు. రేగిడి పోలీస్ స్టేషన్ పరిధిలో 49 కేసులో 900 మద్యం బాటిళ్ళు, వంగర స్టేషన్ పరిధి నుంచి 29 కేసులో 700 మద్యం బాటిళు , సంతకవిటి స్టేషన్ పరిధిలో 52 కేసులో 734 మద్యం ధ్వంసం బాటిళ్లు ధ్వంసం చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో బెల్ట్ షాపుల ద్వారా మద్యం అమ్మకాలు జరిపిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

భూ ఆక్రమణలపై సమగ్ర దర్యాప్తు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అంబేద్కర్ పోరాట సమితి జిల్లా అధ్యక్షులు సొరు సాంబయ్య డిమాండ్ చేశారు. వేదాంత డవలపర్స్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మున్సిపాలిటీలోని భైరిసాగరం, కోటిచెరువు, మేధారబంద, రామయ్యచెరువు, పక్కులబంద, కిచిడిబంద, అలజంగి చుట్టు చెరువు ఆక్రమణకు గురైనప్పటికి ఎటువంటి చర్యలూ తీసుకోకపోవడం అన్యాయమన్నారు. ఫుల్‌బాగ్‌లో ప్రభుత్వ భూమి, గొల్లపల్లి, గొర్లెసీతారాంపురం, భూబందరవలస రెవెన్యూలో వందలాది ఎకరాలు ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందన్నారు. మల్లమ్మపేట రెవెన్యూలో సర్వే నెంబర్ 115-1, 2,3,4లలో 19.50 ఎకరాల భూమిని భూసీలింగ్ కింద ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న ఆయా భూమి ఆక్రమణకు గురైందన్నారు. పాతబొబ్బిలిలో గ్రామ కంఠం భూమి ఎకరా వరకు ఆక్రమణకు గురైనప్పటికి రెవెన్యూ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ఆక్రమణలపై సమగ్ర దర్యాప్తు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోకపోతే పోరాటం చేస్తామన్నారు.

మరియదాస్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి- శృంగవరపు కోట

ప్రముఖ సామాజిక వేత్త, సంఘ సంస్కర్త, బాపూజీ సేవా సంఘం వ్యవస్థాపకులు మరియదాస్ వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు, అభిమానులు బుధవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం పట్టణంలోని సామాజిక ఆసుపత్రిలో 150 మంది రోగులకు పాలు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మరియదాస్ చేసిన సేవలను కుటుంబ సభ్యులు, వారి అభిమానులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు జిఎస్ నాయుడు, శివ వరప్రసాద్, వారి సోదరులు స్టీఫెన్ బాబు, కుటుంబ సభ్యులు, డాక్టర్

రోగులకు పళ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న కుటుంబ సభ్యులు

నీలా, డాక్టర్ ఉషారాణి, తిమిడి వైస్ ప్రెసిడెంట్ సోమినాయుడు, కోపరేటివ్ వైస్ ప్రెసిడెంట్ వసంత సత్యారావు, చిన్నికృష్ణ, తిమిడి మాజీ ప్రెసిడెంట్ రవి, కోపరేటివ్ స్టోర్ సెక్రటరీ చిప్పాడ వెంకటరమణ, కోపరేటివ్ స్టోర్ సేల్స్ మాన్ గనివాడ గోవిందరావు, బాపూజీ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వసతి గృహంలో నేత్రదాన పక్షోత్సవాలు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బక్కు నాయుడుపేట బిఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో బుధవారం నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఈశ్వరరావు మాట్లాడుతూ మరణం తరువాత ప్రతి ఒక్కరూ కళ్లను దానం చేయాలన్నారు. నేత్రదానం వెలకట్టలేని దన్నారు. మరణించిన తరువాత ఆరు గంటల నుంచి 8 గంటల లోపు నేత్రాలు ఉపయోగ పడతాయన్నారు. దీనికి ముందు ర్యాలీ చేపట్టారు.

ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ యు.ఉషారాణి, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మి, వసతిగృహం హెల్త్ సూపర్‌వైజర్ శారద, వైద్య సిబ్బంది, వసతి గృహ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అక్రమ విద్యుత్తు కనెక్షన్ తొలగింపు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని కొమెర గ్రామంలో కోళ్ల ఫారానికి అక్రమ విద్యుత్ కనెక్షన్ పై విద్యుత్ శాఖ అధికారులు బుధవారం దాడులు జరిపారు. కోళ్ల ఫారానికి అక్రమ విద్యుత్తుపై ప్రజాశక్తిలో కథనం ప్రచురించడంతో విద్యుత్ శాఖ ఎఇ హరిబాబు తన సిబ్బందితో గ్రామానికి చేరుకొని కోళ్ల ఫారం అక్రమ విద్యుత్తు కనెక్షన్ నిర్వాహకుని ఆరా తీశారు. విద్యుత్ శాఖ అధికారులు దాడులు జరిపే సమయానికి అక్రమ విద్యుత్ కనెక్షన్ ఉండడంతో నిర్వాహకున్ని మందలించి అక్రమ విద్యుత్ కనెక్షన్ తొలగించారు. అక్రమ విద్యుత్తు కనెక్షన్ ఎన్ని సంవత్సరాలు నుండి తీస్తున్నావా అని ప్రశ్నించారు. అపరాధ రుసుము విధించి, కేసు పెడుతున్నట్లు ఎఇ ప్రజాశక్తికి తెలిపారు. మండలంలోని కోళ్ల ఫారాలు, ఇతర ప్రైవేటు సంస్థలలో అక్రమ విద్యుత్తు వాడకం జరిగితే కేసులు తప్పవని హెచ్చరించారు.

అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలి

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

విద్యాశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పని సర్దుబాటుపై ఉపాధ్యాయుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు టి.రమేష్, ఎస్.మురళీమోహనరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి జి.పగడాలమ్మను కలిసి వినతి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనిసర్దుబాటులో ఇచ్చిన వినతులు పరిగణనలోకి తీసుకోవాలన్నారు. పాఠశాలలో మరుగుదొడ్ల ఫొటోలను అప్‌లోడ్ చేయడం, గూగుల్ ఫారం నింపడం వంటి బాధ్యతల నుండి హెచ్ఎంలను మినహాయించాలని కోరారు. సెల్ఫ్ అసెస్మెంట్ పరీక్ష పేపర్లను స్కూల్ కాంప్లెక్స్ నుంచి పాఠశాల హెచ్ఎంలు తీసుకునేలా అందుబాటులో ఉంచాలని విన్నవించారు. వీటిపై డిఇఒ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు నీరస శ్రీనివాసరావు, పూడి వెంకట నాయుడు, కె.గోవిందమ్మ, తదితరులు పాల్గొన్నారు.

డిఇఒకు వినతినిస్తున్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

ఫిర్యాదులు సకాలంలో పరిష్కరించాలి

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలపై సకాలంలో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులతో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక అర్జీల పరిష్కారంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. అర్జీలు సకాలంలో పరిష్కరించాలని, నాణ్యమైన పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. అర్జీదారునికి ఫోను చేసి వారి సమస్యను తెలుసుకోవాలని తెలిపారు. సంబంధిత అధికారి స్వయంగా అర్జీదారుని కలిసి సమస్యను పరిష్కరించాలన్నారు. ఆర్థిక పరమైన అర్జీలను ప్రభుత్వానికి ఆమోదం కోసం పంపించాలన్నారు. ఆర్థికేతర సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో జాయింటు కలెక్టర్ ఎస్.ఎస్. శోభిక, డిఆర్‌ఒ జి.కేశవ నాయుడు, డిఆర్‌డిఎ పీడీ వై.సత్యం నాయుడు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, జిల్లా పంచాయ తీరాజ్ ఇంజనీరింగ్ అధికారి ఎం.వి.ఆర్.కృష్ణాజి, డిపిఒ బి.సత్యనారాయణ, పాల్గొన్నారు.

తల్లికి వందనం వారికే ఇవ్వాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులకు మాత్రమే తల్లికి వందనం ఇవ్వాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర అకాడమిక్ కన్వీనర్ జెసి రాజు, జిల్లా గౌరవ అధ్యక్షులు బి.జోగినాయుడు కోరారు. ప్రభుత్వ పాఠశాలల ఉనికి ప్రశ్నార్థకం చేసే జీవోలు 117, 128 రద్దు చేసి తల్లికి వందనం ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఇవ్వాలని కోరుతూ బుధవారం ఎమ్మెల్యే బేబినాయనకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు మీడియం కూడా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

హామీ లేకుండానే ముద్ర రుణాలు : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

బ్యాంకులకు ఎటువంటి హామీ చూపించకుండానే ముద్ర రుణాలను పొందవచ్చునని, ఈ అవకాశాన్ని లబ్దిదారులు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోరారు. ప్రధానమంత్రి ముద్ర యోజన పథకం కింద శిశు విభాగంలో రూ.50 వేలు వరకు, కిశోర్ విభాగంలో రూ.5లక్షలు వరకు, తరుణ్ విభాగం కింద రూ.10 లక్షలు వరకు ముద్ర రుణాలను పొందే అవకాశం ఉందని చెప్పారు. జిల్లా స్థాయి డిసిసి, డిఎల్ఆర్‌సి సమావేశం కలెక్టరేట్లో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక రుణ ప్రణాళికను, అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థుల కోసం ఆర్‌బిఐ నిర్వహిస్తున్న క్విజ్ పోటీల పోస్టర్లను ఆవిష్కరించారు.

చిరు వ్యాపారులకు, చిన్న చిన్న యూనిట్లను స్థాపించే వారికి ముద్ర రుణాలు ఎంతో ప్రయోజనకరమని కలెక్టర్ పేర్కొన్నారు. ఎటువంటి హామీ చూపించకుండానే ఈ రుణాలను బ్యాంకులనుంచి సులువుగా పొందవచ్చునని సూచించారు. పిఎంఇజిపి పథకం క్రింద ఈ ఏడాది 400 మందికి రుణాలు మంజూరు చేసి, వెంటవెంటనే యూనిట్లను స్థాపింపజేయాలని ఆదేశించారు. యూనిట్ల స్థాపనకు దరఖాస్తు చేసుకున్న వారికి 8 రోజుల్లోనే ప్రభుత్వ శాఖలు అనుమతులను మంజూరు చేసి, రుణాల కోసం దఖాస్తులను బ్యాంకులకు పంపించాలన్నారు. భూమిని సాగు చేస్తున్నవారికే పంట రుణాలను మంజూరు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అర్హులందరికీ కిసాన్ క్రెడిట్ కార్డులను జారీ చేయాలని ఆదేశించారు. ప్రజల జీవనోపాది మెరుగుపడే విధంగా ప్రభుత్వ పథకాలను అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్, ఎల్‌డిఎం వివి రమణమూర్తి, నాబార్డు డిడిఎం నాగార్జున, ఎల్‌డిఒ సునీల్, మెప్మా పీడీ సుధాకరరావు, డిఆర్‌డిఎ ఎపిడి సావిత్రి, నైపుణ్య అధికారి గోవిందరావు, డిసిసిబి సిఇఒ ఉమామహేశ్వరరావు, పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అంబేద్కర్, తదితరులు

క్రీడాకారులను అభినందిస్తున్న ఎస్ఇ ఎం.లక్ష్మణరావు

విజేతలకు ఇపిడిసిఎల్ ఎస్ఇ అభినందన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇటీవల గాజువాకలో జరిగిన ఇంటర్ సర్కిల్ చెస్ టోర్నమెంట్‌లో విజయనగరం జట్టు రెండో స్థానంలో నిలిచింది. ఓపెన్ సింగిల్స్ విభాగంలో ఎ.రామకృష్ణ ఛాంపియన్ షిప్ గెలుచుకొని జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. అక్టోబర్‌లో హైదరాబాద్‌లో ఆలిండియా టోర్నమెంట్ జరుగనుంది. జిల్లా నుంచి ఈ పోటీలకు ఎ.రామకృష్ణ. పి.శివ కుమార్, ఎస్.విజయ్ కుమార్, ఎ.సత్యనారాయణ, చంద్రశేఖర్ పాల్గొననున్నారు. జాతీయ పోటీలకు ఎంపికైన వారిని విద్యుత్ శాఖ ఎస్ఇ ఎం.లక్ష్మణరావు, ఇఇ పి.హరి, క్రీడా కార్యదర్శి జి.శ్రీనివాసరావు, వి.మోహన్ బాబు, అప్పలసూరి, పైడిరాజు అభినందించారు.

డిడిఎంహెచ్ఒ ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-సాలూరు

బాగువలస పిహెచ్‌సి, సాలూరులోని గర్భిణుల వసతి గృహం, బిసి పోస్ట్ మెట్రిక్ బాలుర వసతిగృహాలను మంగళవారం రాత్రి 9.30 గంటల సమయంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ టి.జగన్మోహనరావు ఆకస్మికంగా తనిఖీచేశారు. ఆర్‌బిఎస్‌కె ప్రోగ్రాం అధికారి డాక్టర్ రఘుకుమార్‌తో కలిసి తనిఖీలు చేశారు. పిహెచ్‌సిలో ఒపి రికార్డులు తనిఖీ చేసి జ్వర లక్షణాలతో ఎంతమంది వస్తున్నారు, సాయంత్రం, రాత్రివేళల్లో ఎటువంటి ఆరోగ్య సమస్యలతో ఉన్నవారు పిహెచ్‌సికి వస్తున్నారు, అందించిన చికిత్స వివరాలు, పాము, కుక్క కాటు మందుల లభ్యత వివరాలపై ఆరా తీశారు. గర్భిణుల వసతి గృహంలో చేరిన గర్భిణులతో మాట్లాడి వారి ఆరోగ్య స్థితిని తెలుసుకున్నారు. ఎంసిపి కార్డుల్లో ఆరోగ్య నివేదికలు పరిశీలించారు. కిటికీలకు దోమల నిరోధక మెష్‌ల అమరికను పరిశీలించారు. అనంతరం సాలూరు బాలుర వసతిగృహంలో విద్యార్థులతో మాట్లాడి జ్వర లక్షణాలతో ఎవరైనా ఉన్నారా అని అడిగి తెలుసుకున్నారు. సిక్ రిజిస్టర్ పక్కాగా నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాటా ్లడుతూ అనారోగ్య సమస్యలు ఏ సమయంలో నైనా రావచ్చని, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైద్యాధికారులు రవికిరణ్, ప్రియాంక, సూపర్వైజర్ జయగౌడ్, సిబ్బంది ఉన్నారు.

సిబ్బందితో మాట్లాడుతున్న డిడిఎంహెచ్ఒ

బదిలీ యత్నాల్లో అధికారులు, ఉద్యోగులు

ప్రజాశక్తి-సాలూరు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగులు, అధికారుల బదిలీలకు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో వారంతా గత కొద్దిరోజులుగా బదిలీ యత్నాల్లో బిజీగా ఉన్నారు. ఐదేళ్లు ఒకేచోట పనిచేస్తున్న ఉద్యోగులు, అధికారులు బదిలీ కోసం దరఖాస్తు చేసుకోవచ్చునని ఉత్తర్వులు జారీ అయ్యాయి. రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీ రాజ్, వ్యవసాయ శాఖలకు సంబంధించిన ఉద్యోగులు బదిలీల కోసం పైరవీలు మొదలు పెట్టారు. ప్రధానంగా స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు పెద్దఎత్తున ఇక్కడ నుంచి బదిలీపై వెళ్లిపోవాలని భావిస్తున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, స్థానిక సంస్థలలో వైసిపి పాలకవర్గాలు కొనసాగుతున్న నేపథ్యంలో ఉద్యోగులు బదిలీల కోసం ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. అధికారపార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, మంత్రులు ఉన్న నియోజకవర్గాల్లో మున్సిపాలిటీలు, మండల పరిషత్తులు వైసిపి అధీనంలో ఉన్నాయి. దీంతో అధికారులు, ఉద్యోగుల పరిస్థితి ముందు నుయ్యి, వెనుక గొయ్యి అన్న చందంగా తయారైంది. ఈ నియోజకవర్గ పరిధిలో ఇదే పరిస్థితి కనిపిస్తోంది. మంత్రి సంధ్యారాణి నియోజకవర్గంలో ఉన్న నాలుగు మండల పరిషత్తులు, ఒక మున్సిపాలిటీలో వైసిపి పాలకవర్గాలు ఉన్నాయి. టిడిపి, జనసేనలో చేరికలకు ఆపార్టీ అధిష్టానాలు తలుపులు తెరవక పోవడంతో వైసిపికి చెందిన మండల, పట్టణ స్థానిక నాయకులు నిరీక్షిస్తున్నారు.

సాయి వాలీబాల్ అకాడమీకి ఏడుగురు ఎంపిక

ప్రజాశకి-విజయనగరం టౌన్

జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన విజయనగరం జిల్లా సాయి అకాడమీకి నిర్వహించిన ఎంపికలో బాలికల నుంచి అయిదుగురు, బాలురు నుండి ఇద్దరు ఎంపికయ్యారు. సెప్టెంబర్ 1 వ తేదీన విశాఖపట్నంలో జరిగే అలిండియా సాయి హాస్టల్ వాలీబాల్ ఎంపికలకు వీరిని పంపుతామని జిల్లా వాలీబాల్ అసోషియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జి.సూరిబాబు, కెవిఎఎన్ రాజు తెలిపారు. కార్యక్రమంలో డిఎస్‌డిఒ ఎస్.వెంకటేశ్వరరావు, రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి భగవాన్ దాస్, ఎస్‌జిఎఫ్ కార్యదర్శి కె. కృష్ణంరాజు పాల్గొన్నారు.

రోడ్డు పరిశీలన

ప్రజాశక్తి -భామిని

మండలంలోని కాట్రగడ్డ వద్ద ఇసుక ర్యాంపు ఏర్పాటు కోసం డిఎస్‌పి జివి కృష్ణారావు బుధవారం స్థల పరిశీలన చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఆర్.ఉమామహేశ్వరావు, సిఐ చంద్రమౌళి, ఎస్ఐ డి.అనిల్ కుమార్, ఎంఆర్ఐ రాంబాబు పాల్గొన్నారు.

వచ్చారు.. వెళ్లారు

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని కంబర పంచాయతీ పరిధిలోని గిరిజన గ్రామం కాగితాడలో బుధవారం పిఎం జన్‌మన్ కార్యక్రమం నిర్వహించేందుకు అక్కడ టెంట్లు, కుర్చీలు ఏర్పాటు చేశారు. గ్రామస్తులతోపాటు గృహ నిర్మాణ శాఖ ఎఇ వి.దిలీప్ కుమార్, పంచాయతీరాజ్ శాఖ ఎఇ డి.కళ్యాణదుర్గ చేరుకొని కొంతసేపు ఉపన్యాసం ఇచ్చారు. ఈ గ్రామం జన్‌మన్‌లో ఎంపిక కాని విషయం ఆలస్యంగా తెలియడంతో అధికారులు ఉన్నట్టుండి అక్కడి నుంచి వెనుదిరిగారు. అధికారులు ఎందుకు వచ్చారో, అర్థాంతరంగా ఎందుకు వెళ్లిపోయారో అర్థంకాక ముక్కున వేలేసుకుని గుసగుసలాడుకోవడం గ్రామస్తుల వంతైంది.

శారదకు బి- గ్రేడ్

ప్రజాశక్తి-విజయనగరం కోట

విజయనగరానికి చెందిన ప్రముఖ మృదంగ విద్వాంసులు డాక్టర్ మండపాక రవి సతీమణి, ప్రఖ్యాత గాయనీ పద్మావతీ శారదకు ఆకాశవాణి విశాఖపట్నం కేంద్రం ద్వారా భక్తి సంగీత విభాగంలో బి- గ్రేడ్ సాధించారు. ఈ మేరకు బుధవారం పలువురు సంగీతా భిమానులు, కళాకారులు, సంస్థలు శారదని అభినందించారు.

శారద

మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి-సీతంపేట

పిఎం జన్‌మన్ కార్యక్రమంలో భాగంగా పివిటిజిలకు 11 కీలకమైన మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టిసారించాలని డిఎల్‌డిఒ వివి గోపాలకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పివిటిజి ఆవాసాలలో గ్రామసభలు నిర్వహించి వారికి అవసరమైన పక్కా ఇల్లు, ప్రతి ఇంటికీ కొళాయి, విద్యుత్తు, రహదారుల నిర్మాణం ఉండేటట్లు చూడాలన్నారు. సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి పబలుతున్న ప్రాంతాల్లో వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం, వంద శాతం టీకాలు అందరికీ అందించడం వల్ల వ్యాధి దూరమవుతుందని తెలిపారు. సమావేశంలో ఎంపిడిఒ గీతాంజలి, ఇఒపిఆర్‌డి సత్యం, ఎఒ మాస, మండల ఇంజనీరింగ్ అధికారి కిరణ్ కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ పాపారావు, హౌసింగ్ ఎఇ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

గోతులు కప్పారు

ప్రజాశక్తి కొమరాడ

పార్వతీపురం నుంచి కూనేరు వరకు ఉన్న అంతర్రాష్ట్ర రహదారిపై ఏర్పడిన భారీ గోతులతో నిత్యం ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఇబ్బందులను తప్పించేందుకు, రోజూ జరుగుతున్న ప్రమాదాలను కొంతవరకైనా నివారించేందుకు బుధవారం చొల్లపదం శివాలయం సమీపంలో గోతులను సిపిఎం, టిడిపి నాయకులు ఆధ్వర్యంలో గ్రామస్తులు పూడ్చారు. రాళ్లు, కంకర తెప్పించి గోతులు కప్పారు. దీంతో ఆ మార్గాన వెళ్తున్న వాహనదారులు సంతోషం వ్యక్తం చేశారు. సెప్టెంబరు పదో తేదిలోగా గోతులను పూర్తిస్థాయిలో పూడ్చకుంటే కూనేరు గ్రామం వద్ద పెద్ద ఎత్తున బంద్ చేస్తామని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి, మరడాన కృష్ణమూర్తి నాయుడు, యాల సింహాచలం, లక్ష్మణ రావు, ఎన్.తిరుపతిరావు, సింహాచలం, పాల్గొన్నారు.

ఆస్పత్రి అభివృద్ధిపై సమీక్ష

ప్రజాశక్తి- బలిజిపేట

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్‌పిటిసి అలజంగి రవికుమార్ మాట్లాడుతూ మందులు, సామగ్రి, సిబ్బంది కొరతను నివారించేలా చర్యలు తీసుకోవడానికి అన్ని ప్రతిపాదనలు చేపడతా మన్నారు. సీజనల్ జ్వరాలపై వైద్యాధికారుల దృష్టిసారించాలని సూచించారు. ఎంపిపి నాగమణి మాట్లాడుతూ మలేరియా, టైఫాయిడ్ జ్వరాలు నమోదు కాకపోవడం మంచి పరిణామమన్నారు. వైద్యాధికారి కిరణ్మయి మాట్లాడుతూ ఆస్పత్రిలో తాగునీటి సమస్య, మార్గంలో విద్యుత్తు స్తంభాల సమస్య ఉందని తెలిపారు. కార్యక్రమంలో అదనపు వైద్యాధికారి ఎం.మాధురి, ఎంపిడిఒ విజయలక్ష్మి, ఇతర వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పిటిసి

ప్రజాశక్తి 44వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
అక్షర సత్యాలతో... అభ్యుదయ భావాలతో
సమాజ మార్పే లక్ష్యంగా ప్రజల పక్షపాతిగా,
ప్రత్యామ్నాయ పత్రికగా ముందుకు సాగుతున్న
ప్రజాశక్తి 44వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
ఎ.తిరుపతిరావు
మండల వ్యవసాయాధికారి

మరియు సిబ్బంది, వ్యవసాయ శాఖ కార్యాలయం
గుర్ల మండలం, విజయనగరం జిల్లా

PRAJASAKTI 44 ANNIVERSARY 1981-2024
ప్రజాశక్తి
44వ వార్షికోత్సవ
శుభాకాంక్షలు
కార్మికులు, కర్షకులు, శ్రామిక వర్గాల అభ్యున్నతి కోసం
అక్షర సమరం చేస్తున్న ప్రజా అభ్యుదయ పత్రిక ప్రజాశక్తి
44వ వార్షికోత్సవం సందర్భంగా ఇవియే శుభాకాంక్షలు
బి.వి.వి.కామేశ్వరరావు, ఎపిఒ

మరియు సిబ్బంది, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం
గుర్ల మండలం, విజయనగరం జిల్లా

మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు

జెఎన్‌టియులో ఐడియేషన్ బూట్‌క్యాంప్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెఎన్‌టియులో హైబ్రిడ్ మోడ్‌లో ఒకరోజు ఐడియేషన్ బూట్‌క్యాంప్ బుధవారం నిర్వహించారు. ఇన్చార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి. రాజ్యలక్ష్మి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఉద్యోగం అనే భావనను మించి ఆలోచించాలని అన్నారు.ఉద్యోగ అన్వేషణ అనే కంఫర్ట్ జోన్ నుండి బయటకు వచ్చి, సృజనాత్మకతతో వినూత్నంగా ఆలోచించి ఉద్యోగ ప్రదాతలుగా మారాలని తెలిపారు. జెఎన్‌టియు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. జయసుమ ఈ కార్యక్రమం ప్రాముఖ్యతను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్. రాజేశ్వరరావు మాట్లాడుతూ జొమాటో, ఓలా, ఉబర్, గూగుల్ వంటి వాటిని ఉదాహరణగా చూపుతూ అటువంటి ఆలోచన శక్తిని విద్యార్థులంతా పెంపొందించుకోవాలని కోరారు. ఐఐఎం వైజాగ్‌కు చెందిన ప్రొఫెసర్. సుశీల్ కుమార్ ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్‌గా హాజరయ్యారు. కార్యక్రమంలో విద్యార్థులు, పలువురు ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

చెరువుల ఆక్రమణలపై చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం మండలం కనపాక రెవిన్యూ పరిధిలోని సర్వే నెంబరు 6లో మహంతి చెరువులో ఆక్రమణలను తొలగించి కబ్జాకు పాల్పడిన వారిపై చర్యలు చేపట్టాలని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు ఈశ్వర్ ప్రసాద్ డిమాండ్ చేసారు. చెరువుల కబ్జాలపై ఇప్పటికే అనేక ఫిర్యాదులు ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి చేసినప్పటికీ చర్యలు తీసుకోని అధికార యంత్రాంగంపై కూడా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. చెరువులు ఇతర నీటి వనరుల ఆక్రమణలకు అధికారుల అవినీతి బాధ్యతారాహిత్యం నిర్లక్ష్యమే కారణమన్నారు. ఇప్పటికైనా యుద్ధ ప్రాతిపదికన చెరువులు ఇతర నీటి వనరుల ఆక్రమణలపై చర్యలు చేపట్టకపోతే ప్రజలు పెద్ద ఎత్తున తిరుగుబాటు చేసే పరిస్థితులు కనిపిస్తున్నాయని ఈ సందర్భంగా తెలిపారు.త్వరలో దీన్ని దేశవ్యాప్త ఉద్యమంగా మార్చి భావితరాల మనుగడకు మా వంతు కృషి చేస్తామని, ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా అధ్యక్షులు ఇప్పలవలస గోపాలరావు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన శ్రీనివాస్ కార్యదర్శి అచ్చిరెడ్డి రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటరావు బుజ్జి, శ్రీను జగదీష్ తదితరులు పాల్గున్నారు.

రూ.35 లక్షలతో సిసి రోడ్డుకు ప్రతిపాదనలు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం ఆర్‌టిసి కాంప్లెక్స్ సిసి రోడ్డు నిర్మాణానికి రూ.35 లక్షలతో ఐటిడిఎ ఇంజినీరింగ్ అధికారులు ప్రతిపాదనలు చేశారు. కాంప్లెక్స్ రోడ్డు నిర్మించాలని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని కోరగా, స్పందించిన ఆమె ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎస్ఐ రాజేష్

వ్యసనాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-సీతానగరం

విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ ఎం.రాజేష్ అన్నారు. మండలంలోని జోగుంపేట అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు బుధవారం అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల పట్ల మంచి భావంతో ఉండాలన్నారు. విద్యార్థులు మోటార్ వాహనాలను నడపరాదని, మైనర్లు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే ఇవిఎంల రీవెరిఫికేషన్

జిల్లా ఎన్నికల అధికారి బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం కోట/నెల్లిమర్ల

ఎన్నికల సంఘం సిఇఒ ఆదేశాల మేరకు జిల్లాలో విజయనగరం పార్లమెంటు పరిధిలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల చెకింగ్, రీవెరిఫికేషన్ ప్రక్రియ ఆగష్టు 26 నుంచి 28వ తేదీ వరకు మూడు రోజులపాటు నెల్లిమర్లలోని జిల్లాస్థాయి ఇవిఎంల గోడౌన్‌లో నిర్వహించామని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వెల్లడించారు. ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థులు బొత్స అప్పలనరసయ్య, బెల్లాన చంద్రశేఖర్ ఇవిఎంల చెకింగ్, రీవెరిఫికేషన్ కోసం ఎన్నికల సంఘానికి దరఖాస్తు చేసిన మీదట విజయనగరం పార్లమెంటు పరిధిలోని గజపతినగరం, బొబ్బిలి, నెల్లిమర్ల అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని మూడు పోలింగ్ బూత్‌లకు చెందిన ఇవిఎంలను చెకింగ్, రీ వెరిఫికేషన్ ప్రక్రియను చేపట్టాలని ఎన్నికల సంఘం ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు. గజపతినగరం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి పోలింగ్ కేంద్రం నెం.20లో చెకింగ్, రీవెరిఫికేషన్ కోరుతూ బొత్స అప్పలనరసయ్య, నెల్లిమర్ల అసెంబ్లీ సెగ్మెంట్‌లోని నెం.14 పోలింగ్ కేంద్రం, బొబ్బిలి అసెంబ్లీ సెగ్మెంట్‌లోని 9వ నెంబరు పోలింగ్ కేంద్రంలో ఇవిఎంల చెకింగ్, రీవెరిఫికేషన్ నిమిత్తం బెల్లాన చంద్రశేఖర్ ఎన్నికల సంఘానికి దరఖాస్తు చేశారని తెలిపారు. ఈ మేరకు ఈనెల 24న ముందుగా దరఖాస్తు చేసిన అభ్యర్థులు, వారి ఏజెంట్లకు ఈ ప్రక్రియకు సంబంధించి ఎస్ఒపిపై కలెక్టర్ కార్యాలయంలో అవగాహన కలిగించామన్నారు. 26న గజపతినగరం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని నెం.20 పోలింగ్ కేంద్రానికి సంబంధించిన వెరిఫికేషన్ ప్రక్రియ నెల్లిమర్లలోని ఇవిఎంల గోడౌన్‌లో చేపట్టగా దరఖాస్తు చేసిన అభ్యర్థి బొత్స అప్పలనరసయ్య తరపున బెల్లాన వంశీ ఏజెంట్‌గా హాజరై మాక్‌పోల్ లో పాల్గొన్నారని తెలిపారు. ఈ సందర్భంగా అభ్యర్థి ఏజెంట్ 1400 ఓట్లను నమోదు చేయడంతోపాటు, ఓటింగ్ అనంతరం వివి ప్యాడ్‌ల లెక్కింపు చేపట్టగా ఇవిఎంలో వచ్చిన ఫలితాన్ని పరిశీలించి వాటి పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారని కలెక్టర్ తెలిపారు.

27న బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి నెంబరు 9 పోలింగ్ కేంద్రం తనిఖీ, రీవెరిఫికేషన్ ప్రక్రియ చేపట్టగా దరఖాస్తు చేసిన అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్ స్వయంగా హాజరైనట్టు తెలిపారు. తాను ఇవిఎంల మాక్ పోల్ కోసం కోరలేదని, ఇవిఎంల ఛార్జింగ్‌పై తనకు సందేహాలు వున్నాయని వాటిని నివృత్తి చేయాలని కోరినట్లు తెలిపారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ ప్రకారం మాత్రమే తాము ఇవిఎం. తనిఖీ ప్రక్రియను చేపట్టగలమని ఆయనకు తెలిపామన్నారు. మాక్ పోల్‌పై తమకు ఆసక్తి లేదంటూ దరఖాస్తు చేసిన అభ్యర్థి రాతపూర్వకంగా తెలియజేసి అక్కడి నుంచి నిష్క్రమించడంతో బొబ్బిలి అసెంబ్లీ పరిధిలోని ఇ.వి.ఎం.లో మాక్ పోల్ కొనసాగించలేదని తెలిపారు.

28న నెల్లిమర్ల అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలోని నెంబరు 14 పోలింగ్ కేంద్రం ఇవిఎంకు సంబంధించిన ప్రక్రియ చేపట్టగా అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్ తరపున ఏజెంట్‌గా బెల్లాన వంశీ హాజరైనట్టు తెలిపారు. మాక్ పోల్‌పై తమకు ఆసక్తి లేదంటూ దరఖాస్తు చేసిన అభ్యర్థి రాతపూర్వకంగా తెలియజేసి అభ్యర్థి నిష్క్రమించడంతో నెల్లిమర్ల అసెంబ్లీ పరిధిలోని ఇ.వి.ఎం.లో మాక్ పోల్ కొనసాగించలేదని తెలిపారు. పై అంశాలను వివరిస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘం సిఇఒకు నివేదిక పంపించామని వెల్లడించారు.

పంప్‌హౌస్ కార్మికులకు బేసిక్ వేతనాలివ్వాలి

కమిషనర్ నల్లనయ్యకు సిఐటియు నాయకుల వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కార్పొరేషన్ పరిధిలో పంపుహౌస్ కార్మికులకు బేసిక్ వేతనాలు ఇవ్వాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) నాయకులు నూతన కమిషనర్ పి.నల్లనయ్యకు బుధవారం వినతినిచ్చారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు ఎ. జగన్మోహన్‌రావు, ఉపాధ్యక్షులు ఎం. మురళిమాట్లాడుతూ విజయ నగరానికి తాగునీరు అందిస్తున్న ముషిడిపల్లి , రామతీర్థాలు, నెల్లిమర్ల మాస్టర్ పంప్ హౌస్ లో పనిచేస్తున్న 70 మంది కార్మికులు థర్డ్ పార్టీ విధానంలో ఉన్నారని, వర్మ గారు కమిషనర్ ఉన్నప్పుడు ఆప్కాస్ ఐడిలు జనరేటర్ అయి, ఫైల్ వెనక్కి వచ్చిందని తెలిపారు. మళ్లీ 2024 జూన్ 22 న 49 మందిని ఆప్కాస్‌లో చెర్చుతూ కౌన్సిల్ ఆమోదం జరిగిందన్నారు. అయినా ఫైల్ ముందుకు కదలటం లేదని, మళ్లీ టెండర్ ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. ఇప్పటికే గత 4 సంవత్సరాలలో ఒక్కొక్క కార్మికుడు సుమారు 3 లక్షల రూపాయల జీతం నష్ట పోయారని, మీరైనా న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. పంప్ హౌస్ కార్మికులకు బేసిక్ వేతనం రూ.21వేలు, టెక్నికల్ వేతనం రూ.24500 చెల్లించాలని , బకాయి 3 నెలల జీతాలు ఇవ్వాలని, ప్రతి నెల 10వ తేదీ కి జీతం ఇచ్చే వారికే టెండర్ ఖరారు చేయాలని, 2022 లో అమత పథకం కార్మికులకు బకాయి ఉన్న 2 నెలల జీతం ఇవ్వాలని కోరామని తెలిపారు. వినతి ఇచ్చిన వారిలో అరుణ్, శ్రీనివాసరావు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు సమస్యలు వివరిస్తున్న సిఐటియు నాయకులు జగన్మోహన్

రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డిఇఒ నారాయుడు

పాఠశాలల సందర్శన

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో చినబగ్గ, పూతికవలస, గోరపాడు, గూడంగి కాలనీ పాఠశాలలను డిప్యూటీ డిఇఒ పి.నారాయడు బుధవారం సందర్శించారు. డిప్యూటీ డిఇఒ దత్తత పాఠశాల అయిన చినబగ్గ ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. పదో తరగతి విద్యార్థులకు సబ్జెక్టు టీచర్లు సూచనలు, సలహాలు ఇచ్చారు. వెనుక బడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. విద్యార్థులను గ్రేడింగ్ గ్రూపులుగా విభజించాలన్నారు. మెనూ సక్రమంగా అమలు చేయాలన్నారు. వంద శాతం ఫలితాలు రావడానికి సబ్జెక్టు యాక్షన్ ప్లాన్ తయారు చేసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం పరిసరాలను పరిశీలించారు. ఆయన వెంట సిఎంఒ చిరంజీవులు, ప్రధానోపాధ్యాయులు శారద శ్రీనివాసరావు, డిప్యూటీ వార్డెన్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలి

పార్వతీపురం టౌన్: కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కరించకపోతే నిరవధిక దీక్షలకు సిద్ధమని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌విఎస్ కుమార్ తెలిపారు. బుధవారం జిల్లా ఆసుపత్రి వద్ద ఎపి మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనులు చేస్తున్న శానిటేషన్, పెస్ట్ కంట్రోల్ వర్కర్స్, సెక్యూరిటీ గార్డులు, సూపర్‌వైజర్ల బతుకులు దళారీ కాంట్రాక్టర్ల చేతుల్లో పెట్టడం వల్ల పెరిగిన వేతనాలు ఇవ్వకుండా, ప్రతి నెలా సక్రమంగా జీతాలు చెల్లించకుండా ఇబ్బందులు పెడుతున్నారన్నారు.

ఉల్లిభద్ర పాఠశాలకు రాష్ట్ర స్థాయి అవార్డు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలం లో ఉల్లిభద్ర జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల రాష్ట్ర స్థాయి క్రీడా ప్రతిభా అవార్డుకు అర్హత సాధించినట్లు పిఇటి బి.శ్రీనివాసరావు తెలిపారు. 2023-2024లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-17 విభాగంలో బేస్ బాల్ ఆటలో ఉల్లిభద్ర స్కూల్ క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. జిల్లాస్థాయిలో మొదటి స్థానంలో నిలిచారు. దీంతో క్రీడా ప్రతిభ అవార్డును కలెక్టర్ ఎం.శ్యామ్ ప్రసాద్, డిఇఒ పగడాలమ్మ నుంచి ఉల్లిభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు స్వీకరించారు. సర్పంచ్ శెట్టి దివ్యలక్ష్మి క్రీడాకారులను, ఉపాధ్యాయులను అభినందించారు.

ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

సీతంపేటలోనే డిడి కార్యాలయం కొనసాగించాలి

ప్రజాశక్తి-సీతంపేట

ట్రైబల్ వెల్ఫేర్ డిడి కార్యాలయం సీతంపేటలోనే కొనసాగించాలని మాజీ ఎమ్మెల్యే వి.కళావతి బుధవారం ఐటిడిఎ పిఒ వివి రమణకు వినతి పత్రం అందజేశారు. సీతంపేటలో డిడి కార్యాలయం కొనసాగించడం వల్ల విద్యా సంస్థలకు, విద్యార్థులకు, గిరిజనులకు ఉపయోగ పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు హెచ్.మోహన్‌రావు, నిమ్మక కాంతారావు, సర్పంచ్ తిరుపతిరావు, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

పిఒకు వినతినిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

10 లక్షల మొక్కలు నాటుదాం : కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

జిల్లాలో వన మహోత్సవం కార్యక్రమాన్ని ఈ నెల 30న నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని, ఇందుకోసం 10లక్షల మొక్కలు నాటేందుకు నారును సిద్ధం చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అటవీ శాఖ అధికారులను కోరారు. మొక్కలు పెంచుటకు అవసరమైన నర్సరీలను ఏర్పాటు చేయాలన్నారు. నర్సరీలను ఏర్పాటుకు అనువైన స్థలాలను గుర్తించాలని ఆయన సూచించారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా బుధవారం అటవీ శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీతో అనుసంధానం చేస్తూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. ఫలాలు అందించే మొక్కలు, జీవ వైవిధ్యానికి ఉపయోగపడే మొక్కలు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. మొక్కల వల్ల ఫలసాయం రావాలని, వాటికి విలువ ఆధారిత ఉండాలని ఆయన స్పష్టం చేశారు. జిల్లాలో వన మహోత్సవం కార్యక్రమంలో అవసరమయ్యే మొక్కల సంఖ్యను పరిగణనలోకి తీసుకోవాలని, తదనుగుణంగా నర్సరీలలో మొక్కలు పెంచాలని అన్నారు. మొక్కలు నాటుటకు అనువైన ప్రదేశాలు గుర్తించి పెద్ద ఎత్తున నాటాలని, నాటిన ప్రతి మొక్క బతకాలని ఆయన స్పష్టం చేశారు. మొక్కల వల్ల భూసార పరిరక్షణ జరుగుతుందన్నారు. అటవీ ప్రాంతంలో చెక్ డ్యాములను నిర్మించి భూగర్భ జలాలు పెరిగేటట్లు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈనెల 30న నిర్వహించే వన మహోత్సవం కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ప్రజలను పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేయాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ సూచించారు. మొక్కలు నాటడం ప్రజా ఉద్యమంగా చేపట్టాలని కోరారు. జిల్లా అటవీ అధికారి జి.ఎ.పి ప్రసూన మాట్లాడుతూ ఈ ఏడాది 'ఏక్ పెడ్ మా కె నామ్"శీర్షికన వన మహోత్సవం నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లాలో సీతానగరం మండలం గుచ్చిమి రిజర్వ్ అటవీ ప్రాంతంలో 1.25 ఎకరాల్లో 30న వన మహోత్సవం కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

జిల్లాలో జీవనోపాధి కార్యక్రమాలు చేపట్టాలి

జిల్లాలో జీవనోపాధి కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో జీవనోపాదుల కార్యక్రమాలపై సంబంధిత శాఖల అధికారులతో బుధ వారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో జీవనోపాధుల కార్యక్రమాలు సంబంధిత విభాగాలన్నీ సమన్వయంతో చేపట్టాలని సూచించారు. ట్రైకార్ ద్వారా జరిగే కార్యక్రమాలను సమన్వయంతో పనిచేస్తూ సంబంధిత పథకాలు అర్హులైన గిరిజనులకు అందుటకు కృషి చేయాలని ఆదేశించారు. నైపుణ్య అభివృద్ధి సంస్థ నుండి జాబ్ మేళాలు నిర్వహించి వచ్చే సంవత్సర కాలంలో ఐదు వేల మందికి నైపుణ్య శిక్షణ, ఉద్యోగ కల్పన జరగాలన్నారు. సమావేశంలో జెసి శోబిక, డిఆర్‌డిఎ పీడీ వై.సత్యం నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ వేధింపులు ఆపాలి

ప్రజాశక్తి-సీతానగరం

రాజకీయ కారణాలతో తొలగింపులు, బెదిరింపులను ఆపాలని సిఐటియు మండల కార్యదర్శి గవర వెంకటరమణ, మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి వై.శాంతి కుమారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్కీమ్‌వర్కర్లపై రాజకీయ కారణాలతో అక్రమ తొలగింపులు ఆపాలని మండల విద్యా శాఖ అధికారి-2 మువ్వల వెంకటరమణకు బుధవారం వినతి అందించారు. విద్యాశాఖ పరిధిలోని పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులను, స్కూల్ స్వీపర్లను జిల్లాలో వివిధ ప్రాంతాలలో తొలగించారని, ఇదే ఒరవడిని అధికార పార్టీ నాయకులు మండల స్థాయిలో కూడా ప్రారంభించారని వారు తెలిపారు. సీతానగరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు, తామరఖండి, గెడ్డలుప్పి, బగ్గందొరవలస గ్రామాల్లో స్కూల్ స్వీపర్లపై ఇప్పటికే ఒత్తిడి తెస్తున్నారని, ఇలాంటి చర్యలు ప్రభుత్వానికి తగదని హెచ్చరించారు. గత ప్రభుత్వాన్ని అనేక సందర్భాల్లో విమర్శించిన ఈ ప్రభుత్వ పెద్దలు ఇప్పుడు అదే పద్ధతుల్లో కక్ష సాధింపులకు, తొలగింపులకు పాల్పడడం మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో స్వీపర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పెంకి ఉష, ఆర్.నందిని, ఆర్.నిర్మల, ఎస్.పద్మ, గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎంఇఓకు వినతి అందిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం, స్వీపర్ల సంఘం నాయకులు

ప్రజల నుండి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి, వీరేష్

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

ఎమ్మెల్యే జగదీశ్వరి

ప్రజాశక్తి - కురుపాం

ప్రజల సమస్యలు పరిష్కరించడానికి ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. బుధవారం మండలంలో నీలకంఠాపురం గ్రామంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. నీలకంఠాపురం పంచాయతీ పరిసర గ్రామాల ప్రజలు సమస్యలపై ఎమ్మెల్యేకు వినతులు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేవలం వినతులు తీసుకోవడమే కాకుండా సమస్యకు సంబంధించిన శాఖకు పంపించి పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరచర్ల వీరేష్ చంద్రదేవ్, ఎఎంసి మాజీ చైర్మన్ కోలా రంజిత్ కుమార్, టిడిపి నాయకులు వెంపటాపు భారతి, జిల్లా మాజీ కోఆప్షన్ సభ్యులు రంజిత్ కుమార్ నాయక్, బి.శంకర్, టి. లోకనాదం పాల్గొన్నారు.

శివున్నాయుడు కుటుంబానికి పరామర్శ

కొమరాడ : ఏనుగుల దాడిలో మృతి చెందిన వాన శివున్నాయుడు కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. బుధవారం వన్నాం గ్రామంలో బాధిత కుటుంబ సభ్యులను ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏనుగులను తరలించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు తెలిపారు. పదుల సంఖ్యలో ఏనుగుల దాడిలో రైతులు మృత్యువాత పడటంతో ఆ కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం బాధిత కుటుంబ సభ్యులకు నష్టపరిహారం అందించేలా కృషి చేందన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వీరేష్ చంద్రదేవ్, మండల అధ్యక్షులు ఎస్.శేఖర్ పాత్రుడు, నాయకులు వెంకట్ నాయుడు, సర్పంచ్ విజయలక్ష్మి, మాజీ ఎంపిటిసి బలరాం తదితరులు పాల్గొన్నారు.

పిఎం జన్‌మన్‌తో గిరిజన గ్రామాల అభివృద్ధి

ప్రజాశక్తి-కొమరాడ

పిఎం జన్‌మన్ కార్యక్రమంతో గిరిజన గ్రామాలు అభివృద్ధి అవుతాయని ఎంపిడిఒ ఎం.మల్లికార్జునరావు తెలిపారు. బుధవారం మండలంలోని అర్ధం పంచాయతీ గదబవలస గ్రామంలో పిఎం జన్ మన్ కార్యక్రమం గ్రామసభను నిర్వహించారు. గ్రామసభల ద్వారా గ్రామాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వ చర్యలు చేపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ నవీన్, పంచాయతీ కార్యదర్శి కిశోర్, ఎంఇఒ తిరుపతి నాయుడు పాల్గొన్నారు.

కురుపాం : గిరిజనుల సమస్యలను పరిష్కరించేందుకు గ్రామ సభ ద్వారా కార్యాచరణ చేపడుతున్నామని ఎంపిడిఒ ఎస్.అప్పారావు తెలిపారు. బుధవారం మండలంలో గుమ్మ పంచాయతీ కుంబేమానుగూడలో ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయకాంత్, సర్పంచ్ గోపాలరావు, టిడిపి నాయకులు వెంపటాపు భారతి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఐటిఐ కౌన్సిలింగ్

ప్రజాశక్తి- గుమ్మలక్ష్మీపురం

భద్రగిరిలో ఆర్ఐటిఐలో గురువారం మూడో విడత కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ సునీల్ కుమార్ తెలిపారు. ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని కోరారు.

బుడ్డింపేటలో పొలంబడి

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలో బుడ్డిపేట గ్రామంలో పొలంబడి కార్యక్రమాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. ఎఒ అవినాష్ మాట్లాడుతూ ఖరీఫ్‌లో వచ్చే తెగుళ్ల నివారణపై రైతులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో విఎఎలు పి.లక్ష్మణ్, బి.సుధీర్, సిహెచ్.వినయ్ తేజ పాల్గొన్నారు.

నీమాస్త్రం తయారీపై అవగాహన కల్పిస్తున్న ఎఒ

ఎస్ఐలు నరసింహమూర్తి, వెంకటరమణ

బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐలు

ప్రజాశక్తి-సాలూరురూరల్, మక్కువ

సాలూరు రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐగా పి.నరసింహమూర్తి, మక్కువ పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా మామిడి వెంకటరమణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సాలూరు రూరల్ ఎస్ఐగా బాధ్యతలు నిర్వహించిన మామిడి వెంకటరమణ మక్కువ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. మక్కువ ఎస్ఐగా పనిచేస్తున్న నరసింహమూర్తి సాలూరు రూరల్ ఎస్ఐగా బదిలీపై వచ్చారు.

హెచ్ఐవిపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

ప్రతీ విద్యార్థికి హెచ్ఐవి, సుఖవ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని వైడిఒ నైట్‌వర్క్ ఔట్ రిచ్ వర్కర్ ఎ.గీతారాణి అన్నారు. బుధవారం కురుపాం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మీకు తెలుసా? అనే కార్యక్రమం ద్వారా హెచ్ఐవి, ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పించారు. హెచ్ఐవి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. హెచ్ఐవి సోకిన వారిని చిన్నచూపు చూడకుండా గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఎస్.మురళీ, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

పెదబొండపల్లిలో పొలంబడి

ప్రజాశక్తి పార్వతీపురంరూరల్

మండలంలోని పెదబొండపల్లి గ్రామంలో బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు మేనేజర్ షణ్ముఖ రాజు వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించి, రైతులకు మేలైన వ్యవసాయ పద్ధతుల గురించి వివరించారు. ఎడిఎ శారద మాట్లాడుతూ పురుగు, కలుపు మందులు, రసాయనిక ఎరువులు వాడకం తగ్గించడం వల్ల ఆరోగ్యానికి మంచిదన్నారు. కార్యక్రమంలో కెవికె వ్యవసాయ శాస్త్రవేత్త అమృత వీణ, ఎన్ఎఫ్ఎ తిరుపతి, మాస్టర్ ట్రెయినీ శ్రీరాములు, రైతులు పాల్గొన్నారు.

సేంద్రీయ సాగుతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి-వీరఘట్టం

సేంద్రీయ ఎరువులతో పంటలు సాగు చేస్తే భూసారం పెరగడంతోపాటు అధిక దిగుబడులు సాధించ వచ్చునని మండల వ్యవసాయ అధికారి జక్కువ సౌజన్య రైతులకు సూచించారు. బుధవారం చలివేంద్రి గ్రామంలో ఏర్పాటు చేసిన పొలంబడి కార్యక్రమంలో మాట్లాడారు. సేంద్రీయ ఎరువు తయారీ విధానం, పంటలు ఏ విధంగా సాగు చేయాలో రైతులకు అవగాహన కల్పించారు. గ్రామీణ వ్యవసాయ సహాయకులు, విహెచ్ఎ, ఎపిసిఎన్ఎఫ్ మండల యాంకర్ ఎం.సింహాచలం, రైతులు పాల్గొన్నారు.

వీరఘట్టంలో వర్షం

ప్రజాశక్తి- వీరఘట్టం

మండలంలో బుధవారం మధ్యాహ్నం వర్షం కురిసింది. ఈ వర్షం పంటకు ఎంతో మేలు చేస్తుందని మెట్టు ప్రాంత రైతులు చెబుతున్నారు. గత మూడు రోజులుగా ఎండల తీవ్రత అధికంగా ఉండటం వల్ల ప్రజలు అల్లాడిపోతున్న తరుణంలో వర్షం కురవడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నేడు ప్రజావేదిక

ప్రజాశక్తి- వీరఘట్టం

స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో గురువారం సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించనున్నట్లు ఎపిఒ జి.సత్యం నాయుడు బుధవారం ప్రకటనలో తెలిపారు. మండలంలోని 2023 ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి 2024 మార్చి 31 వరకు ఉపాధి, పంచాయతీరాజ్, ఐటిడిఎ, ఆర్‌డబ్ల్యుఎస్, ఎస్ఎస్ఎ ద్వారా రూ 21.65 కోట్లతో చేపట్టిన 870 రకాల పనులకు సంబంధించి ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

తెలుగు భాషను పరిరక్షించుకుందాం

ప్రజాశక్తి-విజయనగరం కోట

తెలుగు భాషను పరిరక్షించుకుందామని తెలుగు భాషా సేవా సంఘం అధ్యక్షులు ఆర్‌బి రామానాయుడు అన్నారు. బుధవారం గాజులరేగలోని నారాయణ పబ్లిక్ స్కూల్లో తెలుగు భాష దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుకు వెలుగు గిడుగు అని పిల్లల పలకలపై రాసి వరుస క్రమంలో ఉంచడంతో ఎంతగానో ఆకట్టుకుంది. తెలుగు భాషకు విశేష కృషి చేసిన గిడుగు వెంకట రామమూర్తి, గురజాడ వెంకట అప్పారావు, కందుకూరి వీరేశలింగం పంతులు వేషధారణలో పిల్లలు తెలుగు పలుకులు పలికి మంత్రముగ్ధులు చేశారు. ముందుగా గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా రామానాయుడు మాట్లాడుతూ తెలుగు భాషను విస్తృత స్థాయిలో అమలపరచాలని కోరారు. పాఠశాల కరస్పాండెంట్ ఎం.నారాయణ రావు , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'తెలుగుకు వెలుగు గిడుగు' అనే అక్షరాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కమిషనర్ నల్లనయ్య బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం నగర పాలక సంస్థ కమిషనర్‌గా పి.నల్లనయ్య బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయనకు కార్యాలయ ఉద్యోగులు, అసిస్టెంట్ కమిషనర్ తిరుమల రావు పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరాభివృద్ధికి ప్రజా ప్రతినిధులు సహకారంతో కృషి చేస్తానని తెలిపారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న నల్లనయ్య

30న హెచ్‌ఐవిపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

హెచ్‌ఐవిపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి రెడ్ రన్ ర్యాలీని ఈ నెల 30న నిర్వహిస్తున్నట్లు జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టిబి నియంత్రణాధికారి ఎం.వినోద్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ర్యాలీ యూత్ ఫెస్ట్ ఆధ్వర్యంలో ఆర్‌సిఎం సెయింట్ పీటర్స్ స్కూల్ నుండి కలెక్టరేట్ వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. హెచ్‌ఐవిపై ప్రజల్లో ఉన్న అనుమానాలు, అపోహలను నివృత్తి చేయడానికి కళాశాల విద్యార్థులు, ఎన్ఎస్ఎస్, ఆర్ఆర్‌సి వాలంటీర్లు పాల్గొంటారని తెలిపారు. ఈ ర్యాలీని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

రెడ్ క్రాస్ సంస్థలో జనరేటర్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరంకోట

స్థానిక రెడ్ క్రాస్ కార్యాలయంలో 82.5 కెవి జనరేటర్‌ను జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బుధవారం ప్రారంభించారు. జనరేటర్ ఏర్పాటుకు మొత్తం రూ.11.34 లక్షల వ్యయం కాగా ఇందులో రూ.7.67 లక్షలను పవర్ గ్రిడ్ కార్పొరేషన్ నుండి సిఎస్ఆర్ కింద సమకూర్చారు. ఇకపై రెడ్ క్రాస్ సంస్థలో బ్లడ్ బ్యాంక్ కు విద్యుత్ సమస్య ఉండబోదని కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. రెడ్ క్రాస్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయని రెడ్ క్రాస్ అధ్యక్షులు కె.ఆర్.డి ప్రసాద్‌ను కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ కార్యదర్శి సత్యం, తహశీల్దార్ కూర్మనాధ రావు, సైనిక సంక్షేమ అధికారి డాక్టర్ సత్య ప్రసాద్, మెడికల్ ఆఫీసర్, రెడ్ క్రాస్ వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
PRAJASAKTI 44 ANNIVERSARY 1981-2024
44వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
కార్మికులు, కర్షకులు, శ్రామిక వర్గాల అభ్యున్నతి కోసం అక్షర సమరం చేస్తున్న ప్రజా అభ్యుదయ పత్రిక ప్రజాశక్తి 44వ వార్షికోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా ఇవియే శుభాకాంక్షలు
శ్రేయోభిలాషి
విజయనగరం

PRAJASAKTI 44 ANNIVERSARY 1981-2024
ప్రజాశక్తి 44వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
కార్మికులు, కర్షకులు, శ్రామిక వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం అక్షర సమరం చేస్తున్న ప్రజా అభ్యుదయ పత్రిక ప్రజాశక్తి 44వ వార్షికోత్సవం సందర్భంగా ఇవియే శుభాకాంక్షలు
పి.నారాయణరావు, ఎపిఎం
మరియు సిబ్బంది, వెలుగు మండల సమాఖ్య
గుర్ల మండలం, విజయనగరం జిల్లా

ప్రజాశక్తి 44వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

పాఠశాల విద్యాశాఖ ప్రగతి - విజయనగరం జిల్లా

- ★ జిల్లాలో 1460 ప్రాథమిక, 316 ప్రాథమికోన్నత మరియు 456 ఉన్నత పాఠశాలలుమొత్తం కలిపి 2,237 పాఠశాలలలో 2,24,346 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.
- ★ Student Kits: 2024-25విద్యాసంవత్సరం 1,28,198 మంది విద్యార్థులకు స్టూడెంట్ కిట్లును పాఠశాల ప్రారంభము నాటికి అందజేయుటకు ఏర్పాట్లు చేయడం జరిగింది.
- ★ 2023-24 విద్యా సంవత్సరం లో 8వ తరగతి చదువుచున్న 17,324 మంది విద్యార్థులకు మరియు వారికి బోధిస్తున్న 3,685 మంది ఉపాధ్యాయులకు pre-installed BYJUS content తో కూడిన TAB లను గత సంవత్సరం పంపిణీ చేయడం జరిగింది.
- ★ PM పోషణ : జిల్లాలో 1,745 పాఠశాలల్లో 1,00,465 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం తీసుకోవడం జరుగుతుంది. వారానికి 5 రోజులు ఉడికించిన గుడ్డు, 3 రోజులు చిక్కిలతో పాటు 3 రోజులు రాగి జావ వంటి పోషకాహారం అందించడం జరుగుతుంది.
- ★ మన జిల్లాలో 63 స్కూల్స్ ను CBSE స్కూల్స్ గా ఉన్నతీకరించడం జరిగింది. ఈ CBSE స్కూల్స్ లో పనిచేస్తున్న 538 మంది ఉపాధ్యాయులకు LESSON PLAN పై రెండు రోజుల శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరిగింది.
- ★ RTE 12(1)C : ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం 12(1) (c) ప్రకారం 2024-25 విద్యా సంవత్సరము నకు గాను జిల్లా లో గల 283 ప్రైవేటు పాఠశాలలలో దారిద్ర్య రేఖకు దిగువ నున్న విద్యార్థులు 1వ తరగతిలో మొదటి విడత లో 710 మంది, రెండవ విడత లో 593 మంది మూడవ విడత లో 7 మంది మొత్తం 1,320 మంది విద్యార్థులు మూడు విడతలలో ప్రవేశం పొందిరి.
- ★ IFP: జిల్లాలో మొదటి ఫేజ్ లో 1,317 ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్‌లు (IFPలు) మరియు 352 స్మార్ట్ టీవీలను సరఫరా చేయడం జరిగింది. రెండవ ఫేజ్ లో ప్రస్తుతం 815 ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ (IFP) లు మరియు 392 స్మార్ట్ టీవీలను సరఫరా చేయడం జరిగింది. మన జిల్లాకు మొత్తం 2,433 ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ (IFP) లు మరియు 744 స్మార్ట్ టీవీలను 768 పాఠశాలల్లో అందించడం జరిగింది.
- ★ "MANA BADI- MANA BHAVISHYATHU": ఫేజ్- 1 లో 841 ప్రభుత్వ పాఠశాలలో 182.86 కోట్లతో అభివృద్ధి పనులు చేయడం జరిగింది. ఫేజ్-2 లో భాగంగా జిల్లాలో 824 (Old 738+ New 86) ప్రభుత్వ విద్యా భవనాలకు 133.08 కోట్లతో 10 రకాల కంపోనెంట్స్ తో అభివృద్ధి పనులు చేయడం జరుగుతున్నది.
- ★ PM SHRI (Pradhan Mantri Schools for Rising India) కార్యక్రమములో బాగంగా జిల్లాలో30 పాఠశాలలను ఎంపిక చేయబడ్డాయి.PM SHRI లో 8 పాఠశాలలకు కెమిస్ట్రీ లాబ్స్ మంజూరైనవి. ఒక్కొక్క పాఠశాలకు 15.58 లక్షల చొప్పున మొత్తం 4.67cr మంజూరుచేయబడినవి. ఆటస్థలం అభివృద్ధి కొరకు 5 లక్షల చొప్పున 1.5cr మంజూరు చేయబడినవి. 2nd phase లో 4 స్కూల్లు మంజూరు అయినవి.
- ★ Inclusive Education: నూతన విజయనగరం జిల్లాలో 2023-24 విద్యా సంవత్సరంలో 27 మండలంలో 0-18 సంవత్సరాల వయస్సు గల ప్రత్యేక అవసరాలుగల 3,499 పిల్లలను గుర్తించడం జరిగింది. వారిలో 27 భవిత సెంటర్ల ద్వారా 540 దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేక బోధనలు మరియు 388 దివ్యాంగ పిల్లలకు PHYSIOTHERAPY సేవలను అందిచడం జరుగుతుంది.
- ★ విజయనగరం జిల్లాలో 2023-24 సంవత్సరం నకు సంబందించి 27 మండలాలలో ఉన్న CWSN (Children With Special Needs) పిల్లలు కొరకు cluster level లో medical assessment camps నిర్వహించడం జరిగింది.
- ★ 2024-25 సంవత్సరం May 1 నుండీ June 9 వరకూ CWSN లపై ప్రత్యేక Drive ద్వారా 636 మండి పిల్లలను వివిధ మండలాలలో గుర్తించడం జరిగింది.
- ★ ప్రభుత్వ పాఠశాలలో సామర్థ్యాల పెంపు కొరకు Foundational Literacy and Numeracy-Gnana Prakash (60days for grade I&II teaching teachers), Learning Improvement Programme, Teaching at Right Level తదితర ప్రోగ్రామ్స్ పై ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ తరగతులు మరియు విద్యార్థులకు సంనద్ధత కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది.
- ★ Model Foundation Schools (Co-located Anganwadis) : జిల్లాలో 2 పాఠశాలలను మోడల్ ఫౌండేషన్ Schools గా గుర్తించడం జరిగింది. 1. MPPS Kothapeta , 2. MPPS Parasam.
- ★ రాష్ట్ర ప్రభుత్వం వారి ఉత్తర్వులు G.O. 14 ప్రకారం మన జిల్లాలో 27 మండలాలలో 27 కో-ఎడ్యుకేషన్ కాలేజీలు మరియు 27 బాలికల కాలేజీలు ఏర్పాటు చేయడం జరిగింది. అందులో 8 (1 ఇప్పటికే ఉన్నతీకరించగా ం 7 ప్రస్తుతం ఉన్నతీకరించడం జరుగును) ఉన్నత పాఠశాలలను హైస్కూల్ ప్లస్ గా ఉన్నతీకరించడం జరిగింది.
- ★ 10th Results: మార్చి లో జరిగిన పదవతరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలలో విజయనగరం జిల్లా 91.82% తో రాష్ట్రంలో 5వ స్థానంలో నిలిచింది. 23,690 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవగా 21,752 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.
- ★ KGBV : 2023-24 విద్యా సంవత్సరంలో 10 వ తరగతి KGBV ఉత్తీర్ణతా శాతం 96.29% తో , 11 KGBV లు శత శాతం ఉత్తేర్ణత సాధించాయి మరియు ఇంటర్మీడియట్ లో KGBV ఉత్తీర్ణతా శాతం 81% తో, 7 KGBV లు శత శాతం ఉత్తేర్ణత సాధించాయి.
- ★ 2023-24 విద్య సంవత్సరం లో KGBVలలో 10 వ తరగతిలో 1024 మంది విద్యర్థులకు గాను 986 మంది 96.29% తో ఉత్తీర్ణత సాధించారు. 11 KGBVలలో 100% ఉత్తీర్ణత సాధించారు. Intermediate లో 81% మంది ఉత్తీర్ణత సాధించారు.

KGBV Admissions :

- ★ 6 వ తరగతి లో KGBVలలో ఉన్న 1,040 సీట్ల కు గానూ 4,085 మంది విద్యార్థులు online లో దరఖాస్తు చేసుకున్నారు. అందులో 1,040 మంది (100%) చేరడం జరిగింది.
- ★ Intermediate ప్రథమ సంవత్సరం KGBV లలో ఉన్న 1040 సీట్లకు అడ్మిషన్ కోసం 2,300 మంది ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకున్నారు. 1009 మంది ఇప్పటివరకూ చేరడం జరిగింది.

డా॥ బి.ఆర్.అంబేద్కర్, I.A.S
జిల్లా కలెక్టర్ మరియు మేజిస్ట్రేట్
విజయనగరం జిల్లా

శ్రీ ఎన్.ప్రేమ్ కుమార్
ఎపిసి సమగ్ర శిక్షా &
జిల్లా విద్యాశాఖాధికారి, విజయనగరం